# అసురగణం

## శ్రీ క. నా. సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

### 31

ప్రేమనిగురించి నా మనస్సులోవున్న అభిప్రాయం ఏమిటి? "లవ్" అంటారే దాన్నిగురించి.... ....

నేనుకూడా దీన్నిగురించి ఈనాటివరకూ గట్టిగా ఆలోచించలేదు. నా వయస్సుకూడా అంతగా దొరగిలలేదు. పద్దెనిమిదేండ్లేగా!

అనుభవాలు అంటుంటారే అటువంటివి నాకంతగా ఏమీ లేవు గద.

అయినా నిండని యేళ్ళను, అందని అనుభవాల లోపాన్నీ పూరించగల శక్తిమాత్రం తగినంతవుంది నాకు. ఆ భావనా శక్తిని ప్రేరేపించి, నడిపించడానికి తగిన చదువూ వుంది. పుస్తక జ్ఞానంవుంది. స్పష్టమైన భావన ఉంది. నా విచిత్రమైన పోకడలన్నీ—ఈ స్పష్టమైన భావన, పుస్తక జ్ఞానం, విచిత్ర వూహాశక్తి—వీటి ఫలితాలే కదా!

ప్రేమ అంటే ఏమిటో నాకు తెలుసు. "లవ్" అన్నది ఇదేనని చెప్పటానికి వీలవుతుందో, లేదో. కాని ఇదే "లవ్" అన డానికి తగిన ఉదాహరణలు కొన్ని చూపగలను.

డబ్బిచ్చికొన్న ప్రేమ అనుభవం ఒకటి—నేను పోయిన సంవత్సరం మచ్చు చూశాను.

అంత పట్టి అమాయకుణ్ణేమీకాదు నేను.

ఐనా, హేమతల్లి అడిగిన ప్రశ్నకే, ఏమని జవాబు చెప్పాలో తెలీటంలేదు.

ప్రేమ అన్న దాన్ని గురించి నా అభిప్రాయం ఏమిటి?

ఏమేమిటో అనుకున్నాను. అవన్నీ ఆమెతో చెప్పగల్నా? అలా చెబితే, ఆమె మటుకు వింటూ కూచుంటుందా?

హేమతల్లి అడిగినంతమాత్రాన నేను నా మనస్సులో అనుకున్నదంతా ఆమెతో చెప్పేయగల్నా? హేమతో చెప్పొచ్చు, అదే ప్రశ్న హేమ అడిగుంటే—దానికి అర్థం, ప్రయోజనం ఉన్నట్టు నాకు బోధపడి ఉండేది. ఆమె తల్లి నన్నెందు కడగాలి?

పాంటియస్ పైలట్ అనే రాజప్రతినిధి ఎదుట, పరాక్రమశాలియైన ఆ రోమను మహాసామ్రాజ్య ప్రతినిధి ఎదుట బలవంతంగా నిల్చబడిన ఏసుక్రీస్తుని, ఆయన "నిజం అంటే ఏమిటి" అని అడిగాట్ట.

నిజం అంటే ఏమిటో ఏసుక్రీస్తుకే తెలీదా? తెలి సుండి కూడా ఆయన నోరెత్తకుండా, మౌనంగా నిలబడ్డాడట.

నిజం అంటే ఏమిటి అన్నదానికి ఏసుక్రీస్తు ఎవ్వరికీ, ఎప్పుడూ జవాబు చెప్పినట్టు మనకు తెలియదు.

పైలటు వేసిన ప్రశ్నకు నేనూ బదులు చెప్పలేనివాణ్ణే అయుండాలి. అయితే, హేమతల్లి పరాక్రమశాలియైన రాజ ప్రతినిధి కాదు. నేనూ, ఏసుక్రీస్తుని కాదు. ఆమె ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పేయగలవాణ్ణే.

కాని, నేనేమీ బదులు చెప్పలేదు.

### 32

ఉయ్యాల అందంగా, మెల్లిగా వూపుతూ కూచున్న ఆ స్త్రీని తలెత్తి చూశాను. వెనకపక్క ఉన్నట్టనిపించే నీడను మరచిపోయి, ఒక్క నిమిషం మరచిపోయి, ఆ మహాతల్లినే ముఖా ముఖిగా చూశాను. ఒక్క నిమిషంకన్నా కూడా ఎక్కువసేపే, తలెత్తి జాగ్రత్తగా గమనించాననుకుంటాను. అంతకుముందు, నేను ఏ స్త్రీనీ అంతసేపు, అలా చూడలేదు.

ఆమెని కూడా.... ....అవును, అదే ఆమెని కూడా... .... ఈమె కూతురైన ఆ పిల్లని కూడా.......ఆమె పేరు కూడా సమయానికి జ్ఞాపకం రావటంలేదు నాకు......ఆ హేమను కూడా నేను ఇంతసేపు తలెత్తి ముఖాముఖి చూడలేదు. కళ్ళని కళ్ళు కప్పించనీయలేదు.

హేమతల్లికి వయస్సు నలభైకి పైబడి ఉండాలి. యాభై కూడా దాటి ఉండవచ్చు, చూడ్డానికి మాత్రం. నిజంగా ఇంకా ఎక్కువే ఉండొచ్చు.

ఆకర్షణీయంగా, అందంగావుండే గుండ్రని ముఖం. గడ్డం కింద భాగంమీద అందంగా గుంటపడుతుంది. విశాలమైన సోగకళ్ళు—అరేబియా స్త్రీల చిత్రాల్లో కనబడేలాగు, దట్టంగా పొడుగ్గా, మొనల్లో సన్నబడి వంకర తిరిగిన కనుబొమలు. పాత కాలపు స్త్రీలలో కనిపిస్తుందే — ఆమాదిరి ఎర్రటి ముఖం మీద చటుక్కున కనిపించే పచ్చ బొట్టు. అది స్వాభావిక మయిందా, అస్వాభావికమయిందా అని నన్నే నేనుప్రశ్నించుకున్నాను.

ఆ అస్వాభావికమైన పచ్చ నరం కారణంగానేమో, ఆమె నాకు నా బామ్మగార్ని జ్ఞాపకం చేసింది. నాకు, బామ్మ గారి జ్ఞాపకం— సుఖ దుఃఖ సంశ్లిష్ట మనః క్లేశంలాంటిది. అలా దుఃఖమయ మనః క్లేశం లాగుండటం ఎందువల్లో తెలియదు. కారణం నే నామెను ఎరుగున్న కాలంలోనే ఆమె సుఖానికి అతీతురాలు; దుఃఖానికీ అతీతురాలు. జీవితాన్ని చాలవరకు అనుభవించివేసి, మరి కొంతకాలం ప్రాణాల్తో ఉంటూంది. పోయి వెల్లకిలాపడున్నప్పుడు, ఆమె ముఖంమీది పచ్చబొట్టు ప్రాణంతో కదలుతూన్నట్టనిపించింది నాకు. బామ్మ తన ఎనభై ఎనిమిదోయేట చచ్చిపోయినప్పుడు నాకు తొమ్మిదేళ్ళు.

ఆ బామ్మ నన్ను ఒక్క రోజైనా, ఇలాంటి ప్రశ్నలడిగేది కాదు — అది మాత్రం ఖాయం. ప్రేమ అనే తత్వంకాని, 'లవ్' అన్న మాటగాని, ఆమె రోజుల్లో ఆమెవంటివాళ్ళకు ఎవరికీ తెలియవు.

ఈమె — ఈ బామ్మ అని నాలోనే అనుకున్నాను— మరి ఈమె ఇలా అడిగేసిందే... ...?

ఎందుకూ?

## 33

లవ్, లవ్ అని అంటుంటారే, అది ఏమిటి ? దాని గురించి నేనే మనుకుంటున్నాను అని నన్నీమె, పైట చెరగు మెల్లగా గాలిలో కదులుతూంటే, రవివర్మ చిత్రంలో మోహిని లాగా — ఉయ్యాల వూపుతో కూచున్న ఈమె — అడిగింది.

ఎందుకలా అడిగింది?

ఉయ్యాల్లో కూర్చున్న ఆమె వాలకం చూస్తున్నకొద్దీ, నాకు రవివర్మ మోహిని చిత్రమే జ్ఞాపకం వచ్చింది. రవివర్మ తన మోహినిని అందంగావుంటూ, వయస్సు మళ్ళుతూండిన స్త్రీలాగే చిత్రించాడని నాకు జ్ఞాపకం.

వయస్సు ముదురుతూన్న స్త్రీకి మోహావేశం కలిగించే ఆకర్షణ అధికమనిగుర్తించే, ఆ కళాకారు డలా చిత్రించాడేమో!

మోహ పారవశ్యం కలిగించే స్త్రీయేకదా మోహిని?

ఎలాగైనా మోహం కలిగించి, మాయ చేసే, రాక్షసి, తాటకి, శూర్పణఖ—.......

హేమతల్లి అలాంటిదేనా?

''అలాంటి'' అన్న మాటకి అర్థం ఏమిటి?.......అని ప్రశ్నించుకుంటూ కూచున్నాను.

వయస్సులోవున్న యువకులకు మోహ విద్య నేర్పడానికి వుబలాటపడుతున్న, వయసు ముదురుతూన్న స్త్రీయా ఈమె? మోహిని అంటే అదే కదా అర్థం?

మరి, ఇలాంటి స్త్రీలను దుష్ట జంతువులుగా భావించి, సంఘంలో వీళ్ళను బదకనీయకూడదు కదా?

లేకపోతే, కనీసం లక్ష్మణుడు అనే ఆదర్శ పురుషుడు చేసినట్టు, వీళ్ళ ముక్కు, చెవులూ, అందమైన స్తనాలూ కోసెయ్యాలి కదా?

అయ్యో! లక్ష్మణా!

ఎక్కడికి వెళ్ళిపోయావురా? నీ అవసరమున్నప్పుడు కాలమనే తెరలో ఎక్కడో దాక్కున్నావా!

చూశాను! చూశాను! చూసినకొద్దీ ఆమె ఆకర్షణీయమైన స్త్రీయే అన్న నమ్మకమే కలుగుతూంది.

విష జంతువుల ఆకర్షణే విశిష్టమైనది.

రాక్షసుల ఆకర్షణ మరింత విశిష్టమైనది.

కావ్యాల్లో సైతానూ, షైలక్కూ, దుష్ట జంతువులే అయినా, అసురగణం వాళ్ళే అయినా, మరపురాని పాత్రలుగా స్థిరపడిపోవటానికి కారణం, వాళ్ళు చాలా ఆకర్షణ శక్తిగలవాళ్ళు కావటమే.

అస్తమానం పిచ్చి ధోరణుల్లో వూహించే నాలాంటి వాళ్ళు అసురగణం తాలూకు ఆకర్షణలో పడక తప్పదు.

## 34

రెప్ప వాల్చకుండా హేమతల్లిని చూస్తూ కూచున్నాను. నీడ కనబడలేదు. కాని శూర్పణఖే అందంగా మారు వేషం వేసుకొచ్చిందనిపించింది. ఆ మంత్ర జాలంలోంచి తప్పించుకోలేననిపించింది.

మొట్ట మొదట నన్ను చూడగానే ''హేమ ఇంట్లో లేదు'', అన్నదే ఆమె — అప్పుడు వెంటనే నేను, ''ఆమెను వెతుక్కుంటూ రాలేదు నేను,'' అనేసివుంటే, ఆమె ఎలా అర్థం—అపార్థం—చేసుకునేదో!

ఇవన్నీ నా పిచ్చి ధోరణిలో పెచ్చురిల్లే వూహలేనని వెంటనే తోచింది. ఇలా వూహించటానికి ఆధారమేమీా, కొంచెం కూడా లేదు. నేననుకొన్నట్టు అయివుండదు. ఆమె, తన ఒక్కగా నొక్క కూతుర్నిగూర్చి ఖంగారు పడుతూన్న సాధారణ స్త్రీయే అయుంటుంది. తన కూతురు సుఖాన్నే కోరుతూ, నే నెలాంటి వాణ్ణో తెలుసుకోటానికే ఆమె నన్నా ప్రశ్న అడిగి ఉండొచ్చు గద.

అలా అడగటానికి అవకాశం ఉందిగా!

దుష్టమైన, అసాధారణమైన, అసురభావాలేవీ లేకుండానే, యదాలాపంగా ఆమె ఆ ప్రశ్న అడిగుండొచ్చు.

''మొుదటిరోజు వస్తూనే ఈ గడుసరి హేమని చూసి తెల్లబోయాడు. ఆమె మాట్లాడుతూంటే, నోరెత్తకుండా చేతులు నలుపుకుంటూ, తేనె తాగినట్టు మైమరచి పడున్నాడు. రెండోసారి కూడా—ఎవరో పిలిచినట్టు — ఏదో లేనిపోని సాకులు చెప్పుకుంటూ వచ్చాడే వీడు! నా కూతురు హేమే దీని కంతటికీ కారణం. ఈడొచ్చిన హేమని రాక్షసుల్లాంటి ఈ మగవాళ్ళబారినుంచి కాపాడటం తల్లిగా, తన ముఖ్యమైన బాధ్యత కదా? ఏదైనా అ.సిగి అతన్ని బెదరగొట్టి, వెనక్కి తరిమేద్దాం'' అని హేమతల్లి అనుకుని ఉండవచ్చు. అనుకోవటం కూడా న్యాయమే—కాదని నే ననను.

ఉయ్యాల వూపులవేగం ఎక్కువైనట్టు తోచింది. పసుపురంగు అంచుగల ఆమె చీరకొంగు గాలిలో రెపరెపలాడింది. సముద్రపు అలలాగ లేచి అణగిపోయింది. శిలమండ దగ్గరి తెలుపు మెరపులా మెరిసింది.

నేను కుర్చీలో వెనక్కి జరిగి ఆనుకుని, మళ్ళా ఒక సారి ఆమెను తలెత్తి చూశాను.

అందమైన, ఆశ పుట్టించే, కాని వయస్సు ముదురుతూన్న స్త్రీ ఆమె; అయినా స్త్రీయే!

ఉయ్యాల వెనుక కంటికి ఆనని నీడ శూర్పణఖలా కనిపించింది నాకు.

## 35

ఆనీడ దెయ్యంలా వూగుతూన్నట్టు కనిపించింది.

ప్రొద్దుటిపూట. గదిలో ఎండకాని, దీపపు వెలుతురుకాని లేదు. వెలుతురు అంతటా మందంగా, సమంగా వ్యాపించి వుంది. ఒక్కొక్కప్పుడు నీడే లేదు. నాక్కూడా కనబడలేదు.

మళ్ళీ మరుక్షణంలో చూశాను — శూర్పణఖ నీడ. లక్ష్మణుడి నీడే కనబడలేదు.

చటుక్కున "నీకు జవాబు చెప్పగలను నేను. వొద్దు— నిన్ను అవమానపరచటం ఇష్టంలేదు నాకు. జవాబు చెప్పను నీకు" అని చెప్పెయ్యాలనిపించింది.

"గట్టిగానే "నీకు......." అంటూ ప్రారంభించాను.

శూర్పణఖ నీడ లేచి, చుట్టూ కమ్ముకుని నన్ను చూసి "వెవ్వే" అని వెక్కిరించినట్టు అనిపించింది. నా నోట్లోంచి మాట పెగల్లేదు. "నీకు" అన్నది కూడా ఆమెకు పూర్తిగా వినిపించి ఉండదు; ఔను.

నాలో వున్న ధైర్యం నోటివరకు రాలేదు.

నేను ఇరుకులోపడి, తడబడుతూండటం చూసి, ఉయ్యాలలో మోహిని వూగటం ఆపకుండా నవ్వినట్టనిపించింది.

నవ్వనీ. ఇష్టం మొచ్చినట్టు నవ్వుకోనీ. అందువల్ల నాక్కలిగే నష్టమేమీ లేదు.

ఈ పద్దెనిమిది, పంధొమ్మిది సంవత్సరాలలో ఎందరో నన్ను చూసి నవ్వారు!

ఈమె నవ్వితే యేం? ఎందురు నవ్వినా లక్ష్యం చేయకుండా పోతూ ఉండటం అలవాటయిపోయింది నాకు.

నాకు నిజంగానే ప్రేమను గురించి తెలుసు. ప్రేమగాని, ఆమె తల్లిగాని, నాకు తెలుసుననుకొన్నదానికంటే ఎక్కువగానే తెలుసు. కావ్యాల్లో, నాటకాల్లో ప్రేమే కాదు, డబ్బిచ్చి కొని అనుభవించే ప్రేమ కూడా నాకు తెలుసు.

అయితే, ఆ విషయంలో నేను విజ్ఞాన సర్వస్వాన్ని కాను. మేహవ్యాధి దేహాన్ని చిల్లులు పొడిచేదాకా డబ్బిచ్చి ప్రేమ సాగరంలో ఈదులాడినవాణ్ణికాను నేను. శరీర వాంఛలే పరమానందమని, పరమార్థమనీ భావించి, పరాకాష్ఠ నందుకొన్న వాణ్ణీ కాను.

డబ్బిచ్చికొన్న — నాలుగున్నర రూపాయలు వెలఇచ్చి సంపాదించిన అనుభవం ఒకటి నాకు అనంతమైన, భావనాతీతమైన, జాగృతిని కలిగించినమాట నిజమే. కొన్ని మాసాలక్రితమే జరిగిన సంఘటన అది. నా దేహాన్ని, మనస్సునీ గాఢంగా కలవరపరచి, నిదురలేపి, హెచ్చరించిన అనుభవం అది.

ఆ అనుభవం నీకు నచ్చిందా అని నన్నడిగి లాభం లేదు. ఎందుకంటే, నాకే దాన్ని గురించి ఏమీ తెలియదు. ఆ అనుభవం నా భావాల్ని అసాధారణ స్థాయికి తీసుకు పోయిందనటం మాత్రం వాస్తవమే.

## 36

అనుభవమంటే సాధారణంగా భావనల్ని ప్రేరేపించేదిగానే ఉండాలికదా?

కావ్యాల్లో, నాటకాల్లో, కట్టుకథల్లోకానవచ్చే ప్రేమానుభవంకాదు నాది. మూల సూత్రాల్లో అది కావ్యాల్లో కనిపించే ప్రేమానుభవంవంటిదే అయ్యుండొచ్చు. కాని డబ్బిచ్చి కొన్నది—బజారుకువెళ్ళి కూరగాయలుకొన్నట్టు కొన్నది—నిలకడైనదికాదు. ఒకరాత్రికిమట్టుకే చేసుకొన్న ఒప్పందం అది. నాలో అది ఏకకాలంలో ఆకర్షణ, ఏవగింపు, నూతనరసానుభవం, వెగటుతనం కలిగించింది. దైవత్వాన్ని, అసురత్వాన్నికూడా ఏకంగా రుచిచూపించింది.

ఈ రోజున తలచుకొంటే, ఆ అనుభవంతాలూకు ప్రత్యేకాంశంగా, ఆ ప్రేమశయ్యాగారంలో చచ్చిపోయి, రక్తపు మరకలువదలిపోయిన నల్లులవాసనే మొట్టమొదట జ్ఞాపకం వస్తూంది.

ఆమె ఎలావున్నదంటే, ఏంచెప్పను నేను? ఆమె కావ్యాల్లో నాయికకాదు; తిలోత్తమో, హెలనో, లేక వీనస్సో, జూలీయట్టో కాదామె. నేనూ రోమియోనికాను అనికూడా చెప్పాలికదా? అయితే, ఆ ప్రేమను నాలుగున్నర రూపాయలకు కొనగలను అని నాకు తోచేదా ?

ఆ అనుభవాన్ని మాటల్లోవివరించటంకూడా తప్పనే అనిపిస్తూందినాకు. ఇలాంటి అనుభవాల్ని మాటల్లో చెప్పకూడదనేకదా, సాధారణంగా మానవసంతతి దీన్ని పూర్తిగా ఆకుమరుగ్గా, తెరమరుగ్గా, గుప్తపరచివుంచింది. తరతరాలుగా మానవులు ఈ అసహ్యాన్ని చూస్తూనేఉన్నా, సామాన్యమైన ఈ విషయాల్ని చూసీచూడనట్టు బతకటానికి ప్రయత్నిస్తున్నాను.

ఈరోజుల్లో,యౌవ్వనోద్వేగంలో, బాల్యదశయొక్కతిరుగుబాటువేగంలో, కాళాకారుల్లో ఒకశాఖవాళ్లు పట్టుబట్టి ఈ విషయాలన్నింటినీగూర్చి బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఇలా మాట్లాడటం ఈ తరానికి సాధ్యమయ్యే

టట్టు చేసినవాడు, డాక్టర్ సిగ్మండ్ ఫ్రాయిడ్ అనే వియన్నా నగరపు మనస్తత్వశాస్త్రనిపుణుడే అని చెప్పాలి. ప్రపంచంలో స్త్రీపురుషుల సంబంధంతప్ప వేరేదీలేదు—ఏదైనావున్నా అది స్థిరమైనదికాదన్న సూత్రంమీద మనస్తత్వమహా మంటపం నిర్మించాడు ఆయన.

మానవజాతి అనుసరిస్తున్న ఎన్నోమతాలలాగ, ఈ మతంకూడా తప్పే—అయినా అదీ మరో మతంగానే అయింది కదా!

ఎలాగైతేనేం—మొత్తంమీద దీన్నిగురించి మాట్లాడటం మానుకోవచ్చుననే అనుకుందాం. కాని అనుభవాల్ని దూరంగా ఉంచటం, అలక్ష్యంచేయటం సాధ్యమవుతుందా? ఆ అనుభవాల్ని వెంటాడుతూ, వ్యాపిస్తూ, విశ్వరూపందాల్చే భావాల్ని దూరంగావుంచటానికి వీలవుతుందా?

అనుభవాల్ని ఆమోదించినంతగా, మానవుడు మాటల్ని గాని, భావాల్నిగాని అంగీకరించటంలేదని నాకూ తెలుసు.

కాని మాటలూ, భావాలూమాత్రమే ముఖ్యం అని అసాధారణుణ్ణైన నేను భావిస్తున్నాను. అవే నా అనుభవానికి అర్థం కల్పిస్తున్నవి.

## 37

మాటల గజిబిజిలో, ఆలోచనల సుడిగాలిలో చిక్కుకొని, తంటాలుపడుతూండటంవల్లనే, నేను "సెమి" ననీ, పిచ్చి వాణ్ణనీ పేరుపొందాను.

హేమతల్లి ఏదో ఒకప్రశ్న అడిగింది—ప్రేమనుగురించి.

తెలుసు, తెలీదు అని ఏదో ఒకటి, జవాబు చెప్పి ఉండాలిసింది నేను.

కిందికీ మీదికీ చూస్తూ, నీళ్ళునములుతూ వూరుకుని ఇంత మథనపడటం ఎందుకు ?—నేను పిచ్చివాణ్ణికానటం వల్లనే అని నాక్కూడా నిదర్శనపూర్వకంగా రుజువైంది.

"ప్రేమనుగూర్చి షేక్స్పియర్‌లోనూ, ట్రిస్ట్రమ్ షాండీలోనూ చదివిందితప్ప నాకు వేరే యేంతెలుసు?" అని జవాబు చెప్పి మాట్లాడకుండా ఊరుకునివుండొచ్చు నేను.

లేక, "ఇదిగో నా జవాబు" అని నా, నాలుగున్నర రూపాయల అనుభవాన్ని పూర్తిగా ఒక్కమాటకూడా వదలకుండా, భావనాస్రవంతి ఆగిపోకుండా, కొంచెంకూడా జంకు, గొంకూ లేకుండా ఆమెతో చెప్పిచూసుండొచ్చు. నల్లులవాసం చేస్తూండిన మంచాన్ని, నూనెమడ్డిపట్టిన ఆ పరుపునీ, తలగడనీ, పదిగొర్రెలు కట్టేసినచోటులాగ కంపుకొట్టే ఆ పిల్లచెమటనీ నేను పూర్తిగా వివరించుండొచ్చు.

నా తల్లితో చెప్పేటట్టు ఆమెతో దాచకుండా నాక్కలిగిన ఆకర్షణననీ, చీదరింపునీ చెప్పిండొచ్చు.

నా తల్లినిగురించే ఏమీతెలియనివాణ్ణి నేను. ఆమె, హేమతల్లి. మా అమ్మతో ఎలామాట్లాడివుండేవాణ్ణో అలా, ఆమెతోమాట్లాడటం సాధ్యంకాదని తోచిందినాకు.

"మీరు చాలాగట్టివారు అని హేమ చెబుతూంటుందే!" అంటూ మొదలుపెట్టిందే—ఎందుకు ?

తన కూతురు నామీద కాస్త గౌరవం చూపెడుతూందని చెప్పకుండా చెప్పటానికి ప్రయత్నిస్తుందా?

లేక నన్ను "ఓహో! గొప్పవాడా!" అని, వెటకారం చేయడానికి ప్రయత్నించిందా?

వెటకారమే అయివుంటుందని శూర్పణఖనీడసోకిన సామ్రాజ్యంలో ఒకవిధంగా తీర్మానించుకొన్నాను.

అలా వెటకారం చేసిందంటే, నేను కోపగించుకోటం న్యాయమేకదా? కాని సాహసించి ఆమెమీదకోపపడి, ఏమీ చెప్పలేకపోయాను. ఎందుకిలా చేశాను? అంటూ, నన్నే ప్రశ్నించుకోవటం తప్ప, అంతకుమించి నావల్ల ఏదీ చేత కావటంలేదు.

## 38

నాకు ఎదురైనసందర్భం అసాధారణమైనది.

హేమతల్లి నన్నడిగినప్రశ్నకూడా అసాధారణమైనదే. సాధారణంగా ఎవ్వరూ·· ఆ వయస్సుగల స్త్రీ ఎవరూ, నాలాటి కుర్రవాణ్ణి అడిగేప్రశ్నకాదు అది.

అడిగినావె అసాధారణమైనస్త్రీ ! ఆమెని చూస్తేనే అసాధారణమైనస్త్రీ అని తెలిసిపోతుంది.

అరుంధతికాదామె. అహల్యకూడా కాదు. దేవగణం మనిషికాదామె. అసురగణంలోనిది. తాటకి అనుకున్నాన్నేను. కాదు. శూర్పణఖఅసలుమే సబబు.

నేను కూడా సాధారణమైనవాణ్ణికానుగదా?

రాముణ్ణి నేను.

నాకు సామర్థ్యం, చాతుర్యంవుంటే, నిజంగా నేను గట్టివాణ్ణైతే, ఈ ఇరుకులోంచి బయటపడటానికి ఏదైనా బొంకి సమర్థించుకోటానికి, నా గొప్పతనం ఉపయోగ పడుండాలికదా!

నిజంగా నేను గట్టివాణ్ణికానేమోఅన్న సందేహం కలుగలేదు నాకు. గట్టివాణ్నేఅన్న నమ్మకం నాకుంది.

హేమ నేను గట్టివాణ్ణని నమ్మి మోసపోతే.,...అది కూడా మంచిదేకదా. మోసపోవటంలాంటి శ్రేష్ఠమైన గుణ పాఠం, మరొకటిలేదు మానవులకి; అని నాగట్టినమ్మకం.

గట్టివాణ్ణనే నమ్మకంకలిగించి టోపీవేయటం కూడా ఒక రకం గట్టితనమేకదా?

అంతేకాక, హేమ అనే బి. ఏ. చదివే—అంత బాగా చదవని—విద్యార్థిని ఇచ్చే సర్టిఫికెటుకోసం నేను ఆశపడ్డానా? అది పొందడానికి ప్రయత్నించానా?

హేమతల్లైనాసరే, నన్ను మొద్దుననుకొని నవ్వినా, అలక్ష్యంచేసినా, నేను లక్ష్యపెట్టేవాణ్ణికాను—నిజమే. మొద్దులావుండటానికి కూడా నాకు హక్కుంది. ఎవ్వరూ ఆ హక్కుని అపహరించలేరు.

గట్టివాడు, మొద్దు అన్న బిరుదులన్నీ ఒక ప్రక్కన వుండనీండి. ఈ మొద్దుప్రపంచంలో వాన్నేగురించి నేనెందుకు విచారించాలి? ప్రేమనిగురించి అడిగినా మెవద్దు, డబ్బిచ్చికొన్న ప్రేమానుభవాన్నిగురించి చెప్పటమా, చెప్పకపోవడమా? అది వెంటనే తేల్చేయవలసిన ప్రశ్న.

చెప్పేద్దాం...... అనుకున్నాను.

కాని ఆరోజున ఏదీచెప్పలేదు. క్లాసులో ప్రొఫెసరు ప్రశ్న వేసినప్పుడు, మౌనంగానిలబడే విద్యార్థిలాగా, జవాబివ్వకుండా మౌనం వహించాను.

## 39

నాతత్తరపాటుని సంబాళించుకొని, నేను జవాబుచెప్ప డానికివుండే, హేమవచ్చేసింది. "మంచిదే!" అని నాలోనేనే అనుకున్నాను.

నా అపూర్వ అనుభవాన్ని—నాలుగున్నరరూపాయలు వెండినాణాలిచ్చికొన్నఅనుభవాన్ని—చెప్పేద్దాం, చెప్పేసితీరాలి, లేకుంటే శూర్పణఖ నోరుమూయదు—అన్నఆలోచన ఒక వైపునవుండగా, ఆసమయానికి హేమరావటం మంచిదే అయింది; అల్పుడనన్నబిరుదుపొందకుండా ఈరోజుకి తప్పించుకున్నానని ఒకప్రక్కా, మాటల్లో తూచలేని అనుభవాన్ని మాటల్నిదొర్లిస్తూ వెల్లడించటానికి ప్రయత్నించి వోడిపోకుండా తప్పించుకున్నాననే మరోఆలోచన ఇంకోపక్కా నాకు ఆశ్వాసంకలిగించినై.

హేమ,—కాలేజీలో మాక్లాసులో, నాతోచదువుతూంది. నాతోటివిద్యార్థులూ, ప్రొఫెసర్లూ, చదువుల్లోమటుకు నేను గట్టివాణ్ణే అనుకునిగౌరవిస్తారు. ఆ ఆలోచనకూడా—హేమని జ్ఞాపకం తెస్తూంది కనుక—నాకు సంతోషదాయకంగానేవుంది.

కాని ఈహేమఎవరు ? ఈమె చూపించేగౌరవమే నాక్కావాలా ? అని ప్రశ్నించుకున్నాను.

హేమ సరిగా ఆసమయంచూసి, రావడంకూడా నాకు అవసరమేనా?

అదికూడాకాదు అనేతోచింది.

ఆమెరాకను గమనించనట్టే వుండాలనికూడా ప్రయత్నిం చాను. కాని ఆకస్మికంగా ఎదురయ్యే ఏ పరిస్థితినీ సవ్యంగా సంబా ళించుకోవటం నావల్లకాదే? హేమహాల్లోకివచ్చిందే తడవుగా నేను తలత్రిప్పి, కొంచెంగా తలెత్తిచూశాను.

ఉయ్యాల కొంచెంవేగంగా వూగింది.

శూర్పణఖ నీడ విశ్వరూపం దాల్చింది.

నాలోనేను "అయ్యో! లక్ష్మణా!" అంటూకేకపెట్టాను.

శూర్పణఖ మాట్లాడింది. "హేమా! నీ స్నేహితుడు నీకోసం అరగంటసేపుగా కాచుక్కూచున్నాడే!—ఎక్కడికెళ్లావ్?' కూతుర్ని అడిగింది హేమతల్లి.

"పక్కవీధిలో పంకజాన్నిచూట్టానికి వెళ్లాను, ఆలస్యమై పోయింది" అని మన్నించమంటూన్నట్టు జవాబుచెప్పింది హేమ.

ఆమె అలామన్నించమన్నట్టు మాట్లాడటం నకునచ్చలేదు. ఆలస్యమయితేయేం, కొంపమునిగిపోయిందా అని అడిగివుండ కూడదూనేను? పైనా, ఆమెకోసమా నేనువచ్చింది—ఆమెకోసమే కాచుక్కూచున్నానా? రెండూ నిజాలుకావే!

ఆమెఏదో తప్పుచేసినట్లు ఎందుకుమాట్లాడాలి? తప్పు చేసినవాణ్ణినేను. ఈ రోజు, ఇంతపొద్దుటిపూట, వాళ్లింట్లో నాకేంపని? ఏదోపనుండినట్టువచ్చి,మొద్దులాగకూచుని, కదలక పోవటం నాతప్పా? ఆమెతప్పా?

ఈ సంగతులేవీ చెప్పటానికి నాకవకాశమీయలేదు హేమ, హేమతల్లీ.

## 40

"ఉండండి! ఒక్కనిమిషంలో వచ్చేస్తాను" అంటూ వెంటనే లోపలికిదూసుకుపోబోతున్న కూతుర్ని ఆపింది హేమతల్లి.

"మీ స్నేహితుణ్ణి నేనొకచిన్నప్రశ్న అడిగాను. దానికి జవాబుచెప్పటానికి ఆయన తికమక పడుతున్నాడు," అన్నది శూర్పణఖ.

"నాకు జవాబుచెప్పటం చేతకాదు. నిజమే. ఒప్పు కుంటాను," అన్నాన్నేను తెలివిగా.

బాబోయ్! ఇంతమటుకైనా నోటినుంచిమాటలు పెగలి నయ్యే! అంతవరకూ నాకుతృప్తే.

హేమ తనతల్లినిచూస్తూ, కన్నుగీటుతూ తేలిగ్గా, కొంటెగానవ్వుతూ, "నువ్వేప్రశ్నవేసుంటావో నాకు తెలుసులే!" అంది.

అనినన్నుచూసి, కన్నుగీటి, వెనుకఉన్న డోర్‌కర్టెన్‌వెనక్కి మాయమయింది.

ఇంతవరకూ ఏమీశబ్దంచేయనిఉయ్యాల ఇప్పుడు వూపుతో పాటు కిర్‌మంది. కిర్‌కిర్రుమంది. లేక ఇంతసేపునేనే ఆ ధ్వనిని గమనించలేదో?

హేమకు తెలుసట—ఆమెతల్లి—ఆశూర్పణఖ నన్నడిగిన ప్రశ్న!

అంటే......అంటే ఏమిటి?

నేను మళ్లాఆలోచనల్లో కొట్టుకుపోతున్నాను.

ఇలా ఆలోచనల్లో కొట్టుకుపోవటమనేదే నా అసాధారణ త్వానికి మొట్టమొదటిలక్షణమనుకుంటాను. కాని ఎంత ప్రయత్నించి, ఆలోచనల్లో మునిగిపోకుండా, కొట్టుకుపోకుండా వుండటం నావల్లకాలేదు. ఎలాగూ నాఅదుపులోలేని ఆలోచనలు బుసబుస పొంగివస్తుంటే నేనేంచేయను?

సామాన్యమైన, సులువైన ఏదోపనిలో నిమగ్నుడనైవున్న ప్పుడుకూడా, ఒక్కొక్కప్పుడు నా ఆలోచనలు నన్ను పెడదారు ల్లోకి లాగి, దయ్యంలా దౌడుతీయించి,లాభంలేని, ఒక్కొక్కప్పుడు అర్థంకూడాలేని, కారణంలేని అర్థానర్థాలను తెచ్చిపెడుతుంటాయి నాకు. మాటలఉచ్చుల్లో, ఆలోచనలవలల్లో చిక్కుకొని వూపి రాడక తికమకపడేవాణ్ణి. తీరూతెన్నూలేని జడకోలాటపు చిక్కు ముడిలాంటిదిది.

కంటికెదురుగాకనిపించేది అసత్యం, సత్యమన్నదింకేదో ఒకటుంది.......అనినేననుకుంటున్నందుకు పాపపరిహారం ఎక్కడ పొందగలను? ఏదోగుడ్డితనం నాకన్నుతెరచింది—లేకమూస్తోంది.

అందరూ నీరు అనుకున్నది గట్టినేలగాను, నేల నీటిదొరువుగాను, మానవమాత్రులు గగనసంచారులుగాను మారిపోతుంటారు.

నా భావనావేగాన్నినుట్టకు, నా ఇష్టంవచ్చినట్టు అదుపులో పెట్టి, నిలిపివేయగలిగితే నేనూ సాధారణమానవుణ్ణిగా, తక్కిన వాళ్లలావారిపోగలను. కాని అది అసంభవమే!

## 41

తనతల్లి నన్నేప్రశ్నఅడిగుంటుందో హేమకుతెలుసట!

అంటే అర్థం ఏమిటి?

ఇద్దరూకలిసి కూడబలుక్కుని అడిగినప్రశ్నేనా అది?

రామాయణంలో వచ్చే శూర్పణఖు ఒక కూతురున్నట్టు ఎక్కడైనా చెప్పారా? వాల్మీకో, జైనుడో, కంబకవో, కృత్తివాసుడో, ఎక్కడైనా శూర్పణఖకూతుర్నుగురించి వివరాలేమైనా వర్ణించివుంటే, నాకీసందర్భంలో ఎంతో ఉపయోగకరంగా వుండేది. ఆవివరాలేవీ తెలీటంలేదే!

తనకు తెలుసునన్నదిహేమ!....ఆమే తనతల్లి ముఖతః నన్నడిగినప్రశ్నాఅది?

నా జవాబుతెలుసుకుంటే, దాన్నుంచి నాజీవితసిద్ధాంతం తనకి బోధపడుతుంది అని వూహించిందా?

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నాజీవిత సిద్ధాంతాన్ని తెలుసుకునేహక్కు, ఉబలాటం ఆమెకెలాకలిగినై?

ఆహక్కు, ఉబలాటం జనించటమే "ప్రేమ" అనొచ్చా?

ఉన్నట్టుండి నాలో ఒకస్ఫురణకలిగింది. నిప్పుల్లోచెయ్యి పెట్టినట్టయింది. మనస్సును మంటల్లోకి తోసేసినట్టుంది. చేతుల్ని,కాళ్లను, మెదడులోముడులను, రోమరంధ్రాల్ని, విదిలించుకొని, త్రుళ్లిపడి లేచిపరుగెత్తుకుపోవాలనిపించింది.

ఈ లోకమే చెరశాలఅన్న సత్యం ఎందరో జ్ఞానులు గ్రహించారు; కాలంగడుస్తున్నకొద్దీ, ఎన్నోసందర్భాల్లో ఈసంగతి చక్కగా వివరించారు. లోకమనే చెరశాలగోడలు కొన్నిసమయాల్లో మానవుల్ని అంతగా బాధపెట్టక, ఏదో కారణంచేత ఎడంగా, దూరంగావుంటూ, మానవుని స్వాతంత్ర్యాన్ని కొంతమట్టుకు గౌరవిస్తున్నట్టు కనిపిస్తాయి. కాని నాలాంటిఅసాధారణమైన వాడికి, నాలా ఆలోచించగలవాడికి, చెరశాలగోడలు తరచూ చాలా దగ్గరగానే వచ్చేస్తుంటాయి. అటూ, ఇటూ కదలనీయకుండా ఐదడుగుల ఐదంగుళాలఎత్తు, అడుగులోపు చదరపు పరిమాణం గల నాదేహాన్ని, నొక్కిపట్టేస్తున్నయి ఈగోడలు. నామనస్సు ఈ మాత్రం పరిమాణంగూడాలేనిది. ఇక ఆత్మ?అదివున్నచోటే తెలీదు. నాకు మనస్సు, ఆత్మ లేవుఅనికూడా కొన్నిసమయాల్లో అనిపిస్తుంది.

ఉన్నట్టుండి చెరశాలగోడలు దగ్గరై, నొక్కేస్తున్న అనుభూతికలిగింది నాకు.

క్షణం గడిస్తే ఇక తప్పించుకోలేనేమో అనిపించింది. ఆ క్షణంలోనే తప్పించుకొని, గోడలు దగ్గరై నొక్కినలిపేసేముందుగానే, పారిపోవాలనిపించింది.

## 42

ఇలాంటి భావోద్వేగంతో ఆ ఒక్కక్షణంలో తప్పించుకొని పారిపోవాలన్నఉద్దేశంతో త్రుళ్ళిపోతున్న నేను, పరుపుమీద చేతులుఆనించి, నొక్కిపట్టి లేచాను.

నిలుచున్నట్టే, రెండు చేతులూ కుర్చీచేతులమీద నొక్కుతూ ఒక్కనిమిషం నిదానించాను.

ఉయ్యాల ఊగటం నిలిచిపోయింది అన్నస్ఫురణ కలిగింది నాకు.

హేమతల్లిని తలెత్తి సూటిగా చూట్టానికి నాకు ధైర్యం లేదు.

ఉయ్యాల గొలుసుముడి పైకప్పుకి రాచుకుంటూ కిర్ మనలేదు.

శూర్పణఖనీడ, భయంకరంగా, అన్ని ప్రక్కలా వ్యాపించి, నిశ్చలంగా, నేనేం చెయ్యబోతానో చూస్తోంది.

శూర్పణఖనీడ నన్ను వెక్కిరించింది.

రుక్కుకూడా అప్పుడప్పుడూ నన్నువెక్కిరించేది! ఆరకం అందంలేదు ఈ వెక్కిరింపులో !

ఒకేక్షణంలో హాలు, ముందుగది, బయటివరండా, ముందున్నతోట, గేటు—అన్నింటినీదాటి బయటికివచ్చేశాను.

కాళ్ళు కొట్టుకుని క్రిందపడిపోతానేమోనన్న భయమే నాకు. తొందరపడటం ఏమాత్రం ఇష్టంలేనివాణ్ణి నేను. అయినా, ప్రాణభయంతో పరిగెత్తేటప్పుడు తొందరపడక పోవటం సాధ్యమా?

అదృష్టవశాత్తు నేనెక్కడా పడిపోలేదు. వేగంతగ్గకుండానే బయటపడ్డాను. బయటఏదో అవసరమైనకార్యం వున్నట్టూ, అంతవరకూ ఆ సంగతి మరచిపోయినట్టూ, పరుగిడుతూన్నట్టు నడస్తూ వెంకటనారాయణారోడ్డమ్మటపోతున్నాను. మౌంట్‌రోడ్డు, పైక్రాఫ్ట్సురోడ్డు, వెంకటరంగం పిళ్లెవీధి—ఆ వరసలో వచ్చిన దారినే తిరిగి వెళ్ళిపోవచ్చు! చాలాదూరం. పైగా ఎండ చుర్రుమంటూంది.

హేమ ఏమనుకుంటుంది?

ఏమనుకున్నాసరే అనుకోనీ, నాకేం! అనిపించింది ఒక్కనిమిషం. మళ్ళీ మరునిమిషమే, ఆమె అలా తప్పుగా అనుకోదనిపించింది.

ఏమనుకున్నాసరే, అనుకోనీ.

ఆమెవల్ల నాకుజరగవలసిన ఉపకారం ఏమీలేదుకదా?

ఆమె ఏమనుకుంటే నాకేంనష్టం? నాకేం లాభం ?

నా తోటి విద్యార్థులు నాకు పెట్టిన పేరు ఆమెకు తెలిసే ఉంటుంది కదా? ''సెమి'' కదా నేను. ఆమె బుద్ధిమంతురాలైతే, ఇలా చేస్తానని ఊహించేఉండొచ్చు.

## 43

ఆమెకూడా చాలాసార్లు తన స్నేహితులతో నన్ను ''సెమి'' అని చెప్పేవుంటుందని, మౌంట్‌రోడ్డు మలుపుతిరుగుతూ అనుకున్నాను.

నేను ఆమెను వెతుక్కుంటూపోయినంతమాత్రాన, నా మనస్సులో ఏవో నాకే తెలియని వేవేవో ఎన్నో వున్నాయన్నంత మాత్రాన, ఆమె నన్ను ''సెమి'' అనుకోటానికి, అని చెప్పటానికి వీల్లేదు అన్న సిద్ధాంతం ఏమీ లేదుకదా!

ఏది ఏమైనా, ఆరోజు నేనుచేసింది అచ్చమైన పిచ్చి చేష్ట అనే అనిపించింది నాకు. నా శక్తికిమించిన, నా పిచ్చితనాన్ని కూడామించిన, పిచ్చిచేష్టే అది. సందేహంలేదు.

మౌంట్‌రోడ్డు, వెంకటనారాయణారోడ్డు కలిసే కూడలిలో ఒక్కనిమిషం నిలబడి ఆలోచించాను. మళ్ళా వాళ్ళింటికి పోయి, ఒక అరగంటసేపు కాలక్షేపం చేసి, వెనక్కి తిరిగి వస్తే? వెనక్కి తిరిగి వెళ్ళవచ్చు—వెళ్ళి మామూలుగా మాట్లాడటమే సాధ్యంకాదు. నేనలా హఠాత్తుగా లేచిరావటం అసాధారణం; మళ్ళీ వెనక్కితిరిగి వెళ్ళటమూ అసాధారణమేఅని సాధారణమైన వాళ్ళకి అనిపిస్తుంది. దీన్నంతా నేనుగా ఎందుకు తలమీదికి తెచ్చుకోవాలి? రేపువెడితే సరిపోతుంది. ఈరోజు తక్షణం వెడితేనేం? ఇరవైనాలుగు లేక ముప్ఫైఆరుగంటలతర్వాత పోతేనేం?

ఎన్నో పిచ్చిపన్లు చేయటానికి అలవాటుపడ్డ నాక్కూడా, వెనక్కి తిరిగివెళ్ళి, ఆ ఉయ్యాల్లోకూచున్న శూర్పణఖముందు నిలబడటం, వెంటనే వెళ్ళి నిలబడటం, పూర్తిగా పిచ్చిపనసీ, అలా చేయకూడదనీ తోచింది.

హేమ మామగారు నన్నుగురించి ఏమనుకుంటారో? ''ఉండు, తోటపని ముగించుకొని నీతో తిరువళిక్కేణి వస్తాను.'' అంటూ వెళ్ళారాయన. అంతసేపూ రాకపోవటం, ఆయన తప్పే కదా? మనిషన్నవాడు ఎంతసేపు కాచుకుసుండాలి?—తను హేమ మామగనుక ఆయనకి ప్రపంచంలో అన్నిహక్కులు వచ్చేస్తాయా?

ఆయన ఏమనుకున్నాసరే! అనుకోనీ!

''ఆ రోజుల్లో వాడి తండ్రికూడా అదేరకం!' అని తన ప్రియమైన అక్కగారికీ, కోడలికీ ఉపన్యాసం చెబుతూ, నా వంశ విశిష్టతని, గొప్పతనాన్నిగురించి ఉపన్యసిస్తున్నాడేమో!

బామ్మకూడా చెప్పేది ''మానాన్న అలాంటివాడే'' అని.

నా తండ్రిలాగా వుండటం నాకు ఇష్టంలేదే—ఏంచేయను. ఎలా తప్పించుకోవటం?

ఆయన—మానాన్న—సర్వసాధారణమైనమనిషనే నాకు అనిపిస్తూంది. నాలుగుకానులు ఒక్కణా అంటూ, పదహారు అణాలు ఒక రూపాయేననుకుంటూ, కాలం వెళ్ళబుచ్చే మనిషి. ఆయనలాగానే వున్నానా నేను?

హారిదైవమా! ఆయనలాగా వుండకుండా వుండటానికి దారి చూపకూడదా నాకు! నువ్వుసర్వశక్తిమంతుడవంటుంటారే—ఏదో దారిచూపలేవా?.....చిన్నదారి....

## 44

మౌంట్‌రోడ్డు తారురస్తా మిట్టమధ్యాహ్నం సమీపిస్తున్న ఎండలో కళ్ళు జిగేల్‌మంటూ మెరుస్తూంది. దూరాన ఎండమావులు కనిపిస్తున్నాయి. దగ్గరికివెడితే కరిగిపోతూన్న తారుమాత్రమే కనబడుతూంది.

నడిరోడ్డుమీద కరిగినతారు కాలికి అంటింది. రోడ్డు బాగా వేడెక్కింది.

భ్రమపెట్టే ఎండమావుల్నిగూర్చి ఆలోచించుకుంటూ నడిచాను. బ్రతుకే మాయ అన్నారు వేదాంతుల్లో కొందరు, మాయ అన్నదే మాయ, అంటూ కవిత్వంచెప్పాడు భారతి.

నడివీధిలో, పట్టపగలు సూర్యుడు ప్రచండంగా వెలిగిపోతూంటే, బారుగా పొడవైన తారురోడ్డుమీద మాయా జాలంలావిచ్చుకున్నయి ఎండమావులు. తడిగా వున్నట్టు చూపులకు మట్టుకే కనిపించింది, నిజమే. కాని నీరు లేదక్కడ. నీరు ఉన్నట్టు భ్రాంతిమాత్రం కలుగుతూంది. భ్రాంతికి, నిజానికి వ్యత్యాసం ఏమిటి?

కంటికి కనుపించేదీ, నిజంగా వున్నదీ కూడా మాట వరసకి, ఒకటేనా?

నా కంటికి హేమతల్లి కొన్నిసమయాల్లో శూర్పణఖలా కనిపించింది.

కంటికి కనుపించేవన్నీ నిజమైనవేనని అంగీకరించాలనిపిస్తుంది నాకు.

హేమ మంచిపిల్లలాగే, కోరదగ్గదిగానే కనిపించింది. అందువల్లనేగా నే నామెను కోరింది? ఈ కనుపించటంకూడా వట్టి వేషంగానే, అబద్ధంగానే, ఎండమావిగానే అయుండొచ్చునేమోఅని సందేహం కలుగుతూంది నాకు;—ఎందుకలా అనిపిస్తూంది?

మంచితనం మీద నమ్మకంతో ముందుకు సాగటానికి మానవుడికి ఉత్సాహం లేదా?

మానవుని అసురగుణమే ఎక్కడచూసినా ముందుకొచ్చి నిలబడుతూంది. మానవస్వభావానికి ఆధారం ఈఅసురగణమేనా?

రావణుడు అన్న రాక్షసుడు లేకపోతే రాముడెందుకు? రాముడి అవసరంఏముంది?

సీత నిజస్వరూపం నిరూపణకాలేదు. కాని, శూర్పణఖ తత్వంలో మనకందరికీ సులభంగానే నమ్మకం ఏర్పడిపోతుంది. శూర్పణఖ, తాటకి, అశోకవనం, రాక్షసస్త్రీలు సీతకన్నా నిజం;

నిజమనే మనం నమ్మటానికి సిద్ధంగావున్నాం. మారీచుడి దుష్టత్వాన్నీ, కబంధుని ఆకలిని, ఆసురగణాల్ని, ఆదర్శపురుషులైన రామలక్ష్మణుల్నీమించిన యదార్థమూర్తుల్లాగ కవివాక్కులో మూర్తీభవించారు వాళ్ళు.

కవి కల్పనలోని లోపమా ఇది?

మానవుని ఆసురగుణాల్ని కెలకటమేనా కవివాక్కు సాధించే ఘనకార్యం?

మానవసంతతి ఏనాడు ఏర్పడిందో ఆనాడే—బహుశః అంతకన్న ముందుగానే ఆసురగణంకూడా అవతారందాల్చింది. మానవసంతతి సర్వనాశనమయ్యేటప్పుడే అదీ నశిస్తుంది.

## 45

నేనింక ఆఇంటివేపు పోను; అనవసరంగా అవస్థలపాలవను; అసాధారణమైన పిచ్చిచేష్టలకు గురికాను; అని నాలో నేను తీర్మానించుకున్నాను. ప్రతిజ్ఞ చేసుకున్నాను.

హేమని, హేమతల్లైన ఆ శూర్పణఖనీ గుర్తించని నా మనస్సామ్రాజ్యం, నేటివరకూ, అనగా నాలుగైదు రోజుల ముందువరకూ, వుండినట్టే వుండిపోనీ అనుకున్నాను. మళ్ళీ, అదే నిమిషంలో అది సాధ్యంకాదన్న ఊహకూడా వచ్చింది.

మనలో, జ్ఞానం అంకురించినప్పుడు, అది ఎటువంటి జ్ఞానమైనా సరే,—మానవుని స్వభావం తప్పకమారుతుంది. చెదిరిపోయిన రసగుళిక, వొలికిపోయిన పాలు, చెడగొట్టుకున్న శీలం—ఇవేవీ మళ్ళీ కూడిరావనే జ్ఞానాన్నీ అంగీకరించక తప్పదు. జ్ఞానం కలిగినతర్వాత పసితనంలోలాగ బ్రతకటం సాధ్యంకాదు!

అందువల్లనే, జ్ఞానమంటే మానవసంతతి, భయపడుతూ వచ్చిందని చెప్పాలనిపిస్తుంది. ఏమీ తెలియకపోవటం సుఖం; అన్నీ తెలిసుండటం దుఃఖాలకి దారితీస్తుంది. జ్ఞానాన్ని దుఃఖముతోసహా భరించటానికి సిద్ధంగావున్నవారికి అప్పగించేసి, తాము చాలవరకూ అజ్ఞానులుగానే వుండిపోవటానికి మనుష్యులు ప్రయత్నిస్తూండటంలోని రహస్యం ఇదేనా ?

ఇకమీదట నేను హేమఇంటికేసి వెళ్ళనని నా అజ్ఞానంలో నేను సంకల్పించుకున్నాను; ప్రతిజ్ఞ చేశాను. వెలుగుతూన్న సూర్యుడూ, తారురోడ్డుమీది ఎండమావులూ, ప్రత్యక్షంగాలేని చంద్రుడూ సాక్షిగా నేను ప్రతిజ్ఞ చేసుకున్నాను—వెళ్ళనని. అయితే నా అజ్ఞానంలోంచి అంకురించిన ప్రతిజ్ఞ అది. అదేనిమిషంలో నాలోని జ్ఞానం నాకు గట్టిగా బోధపరిచింది: నేనా ఇంటివేపు పోకుండావుండటం నావల్ల సాధ్యంకానిపని అని.

మర్నాడో, ఆరోజు సాయంత్రమో కూడా మళ్ళీ వెళ్ళినా వెళ్ళవచ్చు.

హేమ అనే అయస్కాంతం ఆకర్షణా, హేమతల్లి అన్న ఏవగింపూ, వికారమూ ఏకంగానే నా మనసుని బలంగా లాగుతున్నాయని నాకుతెలుసు.

ప్రతిజ్ఞ తప్పకుండా వుండటానికి నేను విశ్వామిత్రుణ్ణా? హరిశ్చంద్రుణ్ణా ?

వాళ్ళు, తారురోడ్డుమీది ఎండమావులు—పురాతన భ్రాంతులు.

నేను, ఇదిగో నెత్తికాలిపోతూ, కాళ్ళు మాడిపోతూ, చురుగ్గా ఇంటికేసి నడుస్తూన్ననేను—నిజం.

నేను చేసుకున్న ప్రతిజ్ఞ మాయ. దాన్ని తిరస్కరించటం, తృణీకరించటం ప్రబలనిజాలు.

మనశ్చాంచల్యం తియ్యనిది. దేహసంచలనమూ తియ్యనిదే. అందువల్లే అందరూ ఈ రెండు సంచలనాల్నీ గౌరవించి అభిలషిస్తూ, అభ్యసిస్తూవచ్చారు. రెండు సంచలనాల్లోనూ, నేను లెక్కలేనంత అసాధారణమైన సుఖం అనుభవించగలగటం కూడా నిజమే. ఎండలోనడవటంలాగ అదీ ఒక సుఖమే.

## 46

ప్రతిజ్ఞ చేయటంలో ఆ నిమిషానికి తృప్తివుంది.

ఆ ప్రతిజ్ఞని మీరటంలోకూడా ఏదో అఖండమైన తృప్తివున్నట్టే కనిపిస్తూంది.

ఇలా కలిగే తృప్తిని ఇష్టంగా భావించటంచేతే చాలామంది ఆడితప్పుతున్నారని చెప్పొచ్చా?

నేను ప్రతిజ్ఞాభంగం చేస్తే, బుద్ధిపూర్వకంగా ప్రతిజ్ఞ భంగించటంలోనిసుఖాన్ని సంపూర్ణంగా అనుభవించాలన్న స్పష్టమైన ఉద్దేశంతోనే, ఆపనిచేస్తాను. దొరికేసుఖాన్ని అనుభవించక ఎందుకువదలాలి?

మనశ్చాంచల్యంలో సుఖాన్నీ, ప్రతిజ్ఞను భంగం చేయుటంలో తృప్తినీ కోరి అనుభవించటానికి సిద్ధంగావున్న నేను అసాధారణ స్వభావంగలవాణ్ణి.

"పోనేపోను ఇకమీద హేమఇంటికి!" అని ఒట్టేసుకున్న నిమిషంలోనే, వెనక్కి తిరిగి ఆమె ఇంటికి వెళ్ళాలనిపించింది నాకు నేను ప్రతిజ్ఞనుభంగంచేయడంతో లోకమే అంతరించిపోతుందా?

అలా అంతరించిపోతుందంటే అదీ ఒక అనుభవంగా శోధించి చూడాలనే, నాకు సరదా.

నేను వెంటనే వెనక్కితిరిగిపోలేదు. ఇంటివేపు చకచకా వేగంగా నడిచాను—ఏదో అవసరం వున్నట్టు. నిజానికి నామట్టుకు తూర్పుకివెళ్ళినా ఒకటే—వెనక్కి తిరిగి, పడమటికివెళ్ళినా ఒకటే.

లోకంలో మానవులు ఏదేదో చేస్తారు. చేసేసి దాని లాభనష్టాల్ని గొప్పగా ఊహించుకుంటూంటారు. ఆ కార్యాలూ, వాటి లాభనష్టాలు లోకంలో ఎవరికీ అంత ముఖ్యంకావు అన్నది వాళ్ళెవరూ ఆలోచించరు.

ప్రపంచం తన ఒక్కడి కోసమేకాదు అన్న జ్ఞానం ఎవడికి ఎప్పుడు కలుగుతుందో!

సాధారణంగా కలగటమేలేదు. అదే మానవలోకంలో శోకానికి పునాది అని చెప్పాలనిపిస్తుంది నాకు.

నేను ముఖ్యం, నన్ను నాశనం చేయటానికే ఈ లోకమంతా పనికట్టుకుని, ప్రతినిమిషం ప్రయత్నిస్తూంది అనే ఆలోచన నాలోంచి పెరికిపారేయటం సాధ్యపడటంలేదు. నే నేమంత

ముఖ్యమైనవాణ్ణి కానని నాకు నేనే చెప్పుకున్నాకూడా, సులభంగా నమ్మకం కుదరటంలేదు.

నవగ్రహాలూ తన్నుగురించే ఏదోవిచారిస్తూ, ఏమో గుసగుసలాడుకుంటున్నాయనుకొనే మానవుడు తనజాతకాన్ని శ్రద్ధగా రాయించిపెట్టుకుంటున్నాడు. పాపం! అమాయికుడు!

సంధ్యవేళ రెండున్నరగంటలకు నేను ఇంటికి చేరుకునేసరికి మానాన్న గారు నా జాతకాన్ని వెతుకుతున్నారు. "ఏరా రామూ! నా డ్రాయరులో నీ జాతకం నకలొకటి పెట్టానే చూశావా?" అన్నారు.

నాకు వినపడనట్టే వూరుకున్నాను.

లోపల, "అయ్యోదేవుడా!" అని అనుకోకుండా వుండలేకపోయాను.

## 47

భోజనాలన్నీ అయింతర్వాత, నేను ఈజీచైరులో ఆనుకుని ఏవో ఆలోచనల్లో, పగటికలల్లో తేలిపోతూండగా రుక్కువచ్చి, "అన్నయ్యా! కేరమ్స్ ఆడదామా!" అంది.

"నీతెలివితక్కువ జగ్గుతో ఆడుకోరాదూ! అన్నాను.

"తెలివైన అన్నయ్యతోనే ఆడదామని!" అంటూ ఎదురు తిప్పింది రుక్కు.

దీనికీ దాంతర్వాతవేసిన ప్రశ్నకూ ఏమిటి సంబంధం? ఆ సంబంధం ఎలా ఏర్పడిందీ నాకు అర్థంకాలేదు. కేరంబిళ్ళల్ని వరుసప్రకారం అమరుస్తూ రుక్కు "మరే! అన్నయ్యా, వాళ్ళింటిలో ఒక అందమైన అమ్మాయి వుందిటే!" అంది.

నాకు చెళ్ళున వీపుమీద చరచినట్టయింది. "ఎవరింట్లో?" అని అడిగేసి సంబాళించుకున్నాను.

"పొద్దున్నకూడా వాళ్ళింటికే కదూ, వెళ్ళావుట!" అని అడుగుతూ మొదటి తెల్లబిళ్ళని టక్కుమని మొదటి దెబ్బతోనే పాకెట్టు చేసేసింది రుక్కు.

"ఎవరింటికి?" అని పెదవి మడతపెట్టి, పంటితో నొక్కిపట్టి అడిగాను.

"ఆవిశ్వనాథంబాబాయ్యగారింటికే, హేమనే ఒక అమ్మాయి నీతో చదువుతూందిట....." అంటూనే టక్కుమని రెండుమూడు తెల్లబిళ్ళల్ని పాకెట్లోకితోసేసింది రుక్కు.

నాకు చాలాకోపం వచ్చేసింది. "నీతో నే నాడనుపో!" అని, మళ్ళీ ఈజీచైరులో వెనక్కిఆనుకున్నాను.

విషయం ఏమీఅర్థంకాక రుక్కు తలెత్తి నా ముఖం చూసింది. మాట్లాడకుండా బిళ్ళలన్నీ ఏరి డబ్బాలోవేసి, కేరం బోర్డు ఎత్తి గోడకి ఆనించింది. తర్వాత నాతో చెప్పకుండా వేరే ఎవరితోనో చెబుతున్నట్టు "ఇతర్లకి తెలివిలేదు, తెలివిలేదు అని చెప్పేవాళ్ళు నిజంగా గొప్పతెలివితక్కువవాళ్ళులా వున్నారు. జగ్గు తెలివిలేందా?" అన్నది.

"ఇలారావే" అని పిలిచాను.

"ఏమిటన్నయ్యా?" అని పరమసాధువులాగ, ఈజీచైరు దగ్గరికివచ్చి నిలబడింది.

ఆమె నోటినీ, కంటినీ, ముక్కునీచూసి నాకు నవ్వొచ్చింది. "ఆ విశ్వనాథంగారు వచ్చారా?" అని అడిగాను. "పదకొండుగంటలకు మంచిసమయంట. నాన్నకి ఒకజాతకం ఇచ్చేసి నీజాతకం అడిగారు. నాన్నగారు వెదికారు, దొరకలేదు."

"ఇవ్వలేదా?"

"వేరే రాసి ఇచ్చారు. అది కనిపించకేగా, నిన్నుకూడా అడిగారు!'

"అదిసరే. ఇంకా ఏం మాట్లాడుకున్నారు, ఇద్దరూ?",

"అదంతాచెప్పాలంటే నే నడిగినప్రశ్నకి ముందు నవ్వు జవాబు చెప్పాలి." అని షరతుపెట్టింది రుక్కు.

గట్టిదే రుక్కు. "ఏమిటి? అడుగు," అన్నాను.

"ఆ అమ్మాయి, అదే, ఆ హేమ, అందంగా వుంటుందా?" అన్నది.

"అందమా? అంటే ఏమిటి?" అన్నాను.

## 48

అందం అంటే ఏమిటి అని తమాషాకోసం అడిగాననే చెల్లాయి రుక్కు అనుకుంది. నిజంగా నాకు తెలీకే అడిగాను.

హేమ అందమైనపిల్లా?

నాకు తెలియదు, నిజంగా తెలియదు.

హేమతల్లి అందమైనదా?

అదీ తెలియలేదు నాకు. నిశ్చయంగా చెప్పలేను.

రుక్కుకూడా అందమైందే. కాని హేమ రుక్కులా లేదు.

ఆ పక్కింటి తెలివితక్కువజగ్గుకూడా అందగత్తె. మరి ఆమెలాకూడా లేదే హేమ. ఆమెని అందగత్తె అని ఎలా చెప్పటం?

జగ్గు తెలివితక్కువదనిఅన్నందుకే రుక్కు ఆక్షేపించింది.

హేమ, హేమతల్లి అందమైనవాళ్ళేకావచ్చు. వాళ్ళు అందంగా వున్నారని చెప్పటానికి తగిన విశేషాలేవీ నాకంటికి కనిపించలేదు. వాళ్ళు చేసుకున్న అలంకారాలన్నీ నా కంటికి కనిపించినయ్యనిమాత్రం చెప్పవచ్చు.

అలంకారాన్ని అందమనీ, ఎండమావుల్ని నిజాలనీ భ్రమపడి మోసపోయే లోకమే ఇది.

ఇదే తిరగేసికూడా చెప్పవచ్చు.

అందం అలంకరణ.

నిజం ఎండమావి!

తెలివితక్కువవాళ్ళు, తెలివితక్కువవాళ్ళని ఇతర్లని ఆక్షేపిస్తూండేవాళ్ళ తెలివితక్కువ వాళ్ళని రుక్కు తన అభిప్రాయం చెప్పేసింది ఇంత క్రితమే; అది నిజమే అయుంటుందా? లోకంలోని పండితులమధ్య నేనే శుంఠనా? నేనే తెలివితక్కువవాణ్ణా?

నేను అసాధారణమైనవాణ్ణి, అసాధారణమైనవాణ్ణి అనుకున్నా. నిజంగా నేనే అతిసాధారణుణ్ణేమో! కావచ్చు కదా?

ఆలోచించగలవాణ్ణి, ఆలోచించగలవాణ్ణి అని అనుకుంటూన్న నేను,మాటిమాటికి ఆలోచించటంలో సుఖాన్ని, దుఃఖాన్ని ఏకంగా గుటకలుమింగుతూన్న నేను, నిజంగా ఆలోచించటం చేతకానివాణ్ణే అయుండొచ్చు. అంచేతే ఇలా కలవరపరిచే ఆలోచన్లు మాటిమాటికీ నాక్కలుగుతూన్నయ్యేమో? పరస్పరం విరుద్ధమైన ఆలోచనల్ని నిమిషనిమిషానికి ఆలోచించగలవాణ్ణి, ఆలోచనాపరుడనవచ్చా?

నేను నా రహస్యాలు అనుకున్నవన్నీ రుక్కుకి ఇట్టే తెలిసిపోయాయి.

## 49

"అంత అందమైన అమ్మాయా హేమ? ఆమె పేరెత్తగానే సొమ్మసిలిపోయినట్టు కూచునిపోయావే అన్నయ్యా!" అంది రుక్కు వదిలిపెట్టకుండా.

"ఆమె అందగత్తో, కాదో నిజంగానే నాకు తేలీదు. నువ్వుచూసి చెప్పు," అన్నాను.

"చూడకుండా విడిచిపెడతానా? నేను చూడకుండానే నాకు వదినగావస్తుందేం?" అంది రుక్కు డబాయింపుగా.

ఇందులో కొత్తవరసలుకూడా వున్నయ్యా అనుకున్నాను. వచ్చే ఆవిడ రుక్కుకి వదినఅవుతుంది కాబోలు.

శూర్పణఖ ఏమీకాబోదు. హేమ మాత్రం వదినైపోతుంది.

ఎందుచేతో...!

"వదినవస్తే ఆ తర్వాత నన్నుకేరమ్స్ ఆట్టానికి పిలవ్వా?" అన్నాన్నేను హేళనగా గొంతులో దుఃఖం ధ్వనింపచేస్తూ.

"నాకు ఆట్టానికి కేరంబోర్డు దొరుకుతుందో, దొరకదో!", అంది రుక్కు అక్కడితోనన్ను వదలిపెట్టకుండా.

"నేను హేమని పెళ్ళి చేసుకుంటానని తీర్మానంఅయిపోయినట్టే మాట్లాడుతున్నావే నువ్వు!", అన్నాన్నేను.

నీమాటల్లోనే తెలుస్తూందిలే—నీకు ఇష్టమేనని", అంది రుక్కు.

పసిపిల్ల రుక్కుకి నామనస్సు, నాకేఇంకా స్పష్టంగా అర్థంకాని మనస్సు, అంతస్పష్టంగా ఎలాతెలిసింది? నాకాశ్చర్యం వేసింది.

నాకు ఇష్టమేనని నేను చెప్పినమాటల్లోనే తెలిసింది అన్నది రుక్కు. నిజంగా నాకిష్టమే. హేమని నేను నా ఫియాన్సీగా, ఆమెనుచూచిన ఆరోజే ఒప్పేసుకున్నమాట నిజమే. ఆమె నన్ను స్వర్గానికి తీసుకవెళ్ళదు; నరకానికే తీసుకువెడుతుంది—అని భావించినప్పటికీ ఆమెన్నేను నా ఫియాన్సీగా స్వీకరించేశాను.

నేనే డాంటేని కానే అన్న సందేహం నన్నులోలోపల పీడిస్తూండింది. కవిగావుండటానికి, కవిత్వంరాయటానికీ, నా శక్తిచాలదనిపించింది. నా అశక్తతను అంగీకరించాను. మహాకవి అవటానిక్కూడా ఒకవిధమైన సాధారణత్వం, తెలివీ కావాలనే నాకు అనిపించింది. అదే నాలో లోపించింది.

ఫియాన్సీ వరకు సరే; ఫియాన్సీ తల్లినిగూర్చి డాంటే చరిత్ర ఏంచెబుతూంది?

నాకు తెలియదు. చదివిన జ్ఞాపకంలేదు.

కాని ఆ ఫియాన్సీకికూడా ఒకతల్లి వుండుండాలికదా? ఆమె అడిగుంటుందా డాంటేని, "లవ్"అంటే ఏమిటని?

శూర్పణఖకే కూతురువున్నట్టు తెలీటంలేదు. వుండుండొచ్చు, కాని ఆపిల్లనిగూర్చి రామాయణంలో ఏమీ దొరకటంలేదు.

## 50

రుక్కుపోరుపడలేక, నేనారోజు సాయంత్రంకూడా బయటికి వెళ్ళిపోయాను.

నడిచిపోతున్నాను.

ఈసారి మాంబళంతట్టు తిరిగిచూడక, చైనాబజారు వేపు పోయాను.

ఇతర్ల కెలావుంటుందో నాకుతెలియదు. నామట్టుకు ఇది గొప్పనిజం. గుంపులు గుంపుల జనలోంచి నెట్టుకుంటూ, తోసుకుంటూ,ఎదురుగా వచ్చిమీదపడేవాళ్ళనీ, పక్కవాటుగావచ్చి పొడిచే వాళ్ళనీలక్ష్యపెట్టకుండా దున్నపోతులాగా, అయితేవేగంగా, నాకు సరిపడా కాస్త త్రోవచేసుకుంటూపోవటంలో, గుడ్డివాడిలాగ ఎదుటి వాళ్ళమీదపడి లేచి దూసుకుపోవటంలో, ఎందరిచేతో తిట్లుతింటూ, ఎందర్నో నోరారతిడుతూ నడవటంలో, నేనొక విశిష్టమైన సుఖాన్ని అనుభవించటంకద్దు. ఆ సంతోషానికిమించిన సుఖమేదీ నేనెరుగను.

జనం గుంపులుగుంపులుగా నలిగిపోతూ, తికమకపడుతూ, కదల్లేకకదిలే మూకల్లోదూరి, నెట్టుకుంటూ, దూసుకుపోవటంలో నాకోవిధమైన ఆనందంకలుగుతుంది.మనుష్యులు విడివిడిగా కాక, గుంపుగాకూడినప్పుడు వాళ్ళప్రవర్తనలు ఎలాఉండేది గమనించి, అర్థంచేసుకోటం నాకొకహాబీ.

సాధారణంగా నాగ్రహణశక్తి పరిమితమైనదే. అదీ, గుంపుల్లో గమనించినదేదీ నాలో గాఢంగా నాటుకుపోదు.అయినా, అల్లాశ్రద్ధగా గమనించడమనేఅలవాటంటే నాకు చాలా ఇష్టం. ఏదోఒకమూల ఏదోచూస్తే అదేనాలో తిరుగాడుతూ నాముందు బ్రహ్మరాక్షసిలాప్రత్యక్షమయేది. ఇంతతీవ్రంగా దాన్ని ఎందకు గమనించానా అనుకునేవాణ్ణి. అంతులేని క్లిష్టమైన సమస్యలెన్నో నన్నెదుర్కొనేవి.

ఈ ఆలోచించటమనేది యాతనగానేవుంది. అయినా, ఆలోచనల్ని అలక్ష్యం చెయ్యలేకపోతున్నాను. ఆలోచించవలసిన నిర్బంధం—రంపపుకోత—నేను ఎంతప్రతిఘటించినా నన్ను వేధిస్తూంది.

ఒక చుక్కని గమనించేటప్పుడు లేచే భావతరంగాలు మరొక చుక్కనుగమనించనీయకుండా నాకళ్ళు కప్పేస్తున్నాయి. ఒక్క చుక్క ఆధారంచాలు; చూచిందాంట్లో కొంతభాగంచాలు; నాభావనామేఘాల్ని విజృంభింపజేసి, తేనెటీగల్నికెలకి "ఝుం" మనిచెలరేగజేయటానికి; స్పష్టంగా కనబడేదాన్నికూడా మరుగుపరచి అంధకారమయంచేసేందుకు—అక్కడికి అదిచాలు. ఏదైనా నా ఆలోచన రేగిందంటే, అదినాలో ఉప్పెనగా వుప్పొంగుతూ, ప్రళయకాలనృత్యానికే దారితీస్తుంది.

ఏం చెయ్యను?

ఏదో గుళ్లో, ఎవడోపాపాత్ముడు, ప్రపంచంలోచచ్చిపోయిన వాళ్ళందరికోసం అన్నట్టు, సన్నాయివాయించేస్తున్నాడు. విని పించుకోకుండా పారిపోవటానికి ప్రయత్నించాన్నేను. అలవాటు చొప్పునకలిగే చావుజ్ఞాపకాల పరంపర నన్ను పరుగెత్తనీయకుండా అడ్డగించి వెంటాడింది. చైనాబజారువరకు అవేజ్ఞాపకాలు. ఆ తర్వాత......అక్కడి జనసమ్మర్దంలో మాయమయ్యాడు యముడు.

## 51

గుంపులు గుంపులుగా, బాటకిరుప్రక్కలా నడుస్తూ, నడిరోడ్డుమీద నానావిధాలవాహనాల్లో నావెనక, నాఎదురుగుండా వస్తూపోతూన్న మనుష్యుల్లో చాలావరకు, ఇంచుమించుఅందరూ—అతిసామాన్యమైన విషయాలేవో ఆలోచించుకుంటూ ఎక్కడికెక్కడికో పోతున్నారు.

అంతమందిలో నాకే......నాఒక్కడికేనేమో ఎక్కడా, ఏ పనీలేనిది!

వాళ్ళ ముఖాల్ని ఒకదాంతర్వాత ఒకటిగా జాగ్రత్తగా గమనిస్తున్నాను. వాళ్ళసాధారణత్వం, వాళ్ళ చూపుల్లోనే కనిపిస్తున్నది. వాళ్ళదృక్పథాలు, లక్ష్యాలు—దృక్పథాలు, లక్ష్యాలు అనే పెద్దమాటలు ఇక్కడవాడవచ్చునంటే!—ఏనాడో దృఢపడిపోయినై వాళ్ళకి; స్థిరపడిపోయినై; ఇంకా గట్టిగా చెప్పదలచుకుంటే స్తంభించిపోయినయ్యనికూడా అనొచ్చు.

నామట్టుకునేను, వాళ్ళదృక్పథాలనో, పోకడలనో, లక్ష్యాలనో అంగీకరిస్తానా? సందేహాస్పదమైన విషయం. వాళ్ళు, వాళ్ళ అవసరాన్నిబట్టి ఇవన్నీ ఒప్పేసుకున్నారు. వాళ్ళ సాధారణత్వం తాలూకు విజయం అక్కడే ఆరంభమయిందనికూడా చెప్పవచ్చు. వాళ్ళ జీవితాలు పదిలంగా సాగటానికి, ఆశాన్వితంగా చిగురించటానికి, ఆదృక్పథాలు, పోకడలు, లక్ష్యాలు చాలువాళ్ళకి.

ఆ గుంపులో, అన్నివేలమందిమధ్య నేనొకణ్ణిమాత్రమే విశిష్టమైనవాణ్ణి, అసాధారణమైనవాణ్ణిఅని నాకు నేనేధ్రువపరచుకున్నాను. నేను అసాధారణుణ్ణిఅనే గట్టినమ్మకం, నేనుమనిషినని దృఢపరచుకొనేటందుకు నాకు అవసరమయింది. నేను నలుగురిలా కాకుండా ప్రత్యేకమైన వ్యక్తిగావుండటం నాకు గర్వమే.

ఈ ప్రత్యేకతే నాకు నానాభాదలూ తెచ్చిపెడుతూందన్న మాటానిజమే. అలా అవస్థపడటంలో నేనొక విధమైనఉదాత్తతను అనుభవిస్తున్నా.

ఈ విషయాన్ని స్పష్టంగానే చెప్పేశాననుకుంటా. నాకూస్పష్టంకాని నాగొప్పతనంసంగతికూడా నోరుజారిచెప్పేశానేమో!

నాకుడిప్రక్క ఒకలావుపాటి, సాధారణమైనమనిషి తొందరగా నన్ను దాటివెళుతూ, ఆగి, వెనక్కి తిరిగి, నాముఖాన్ని సందేహాస్పదంగాచూస్తూ గదమాయింపుగా, సవాలుచేసేటట్టు "ఏందయ్యో?"అని కాస్త గట్టిగానే అడిగాడు.

"ఏం లేదయ్యా!" అంటూ తలెత్తి వాణ్ణిచూస్తూనే జవాబు చెప్పాను.

"సరేసార్!" అంటూ ఇంకావేగంగా ముందుకి వెళ్ళాడతను. ఏమంత అవసరమైనపనుందో ఏమో ఆతనికి? ఎవడికితెలుసు?

"ఎవడో పిచ్చాడు. తన్లోతనే మాట్లాడుకుంటూ పోతున్నాడు," అనుకునిఉంటాడు. నోరుతెరచి బయటికిమాత్రం అనలేదు.

"ఏం లేదయ్యా!" అని ఏదోవట్టినోటిమాటగా, మాటవరసకి, బుకాయింపుగా చెప్పితప్పించుకోగలిగాను. నిజమే. కాని ఏమీలేదన్న సంగతి నిజమేనా?

ఎన్ని సంగతుల్లేవు!

తప్పించుకొనడానికి వీల్లేనివే వేనకువేలున్నాయిగదా!

వట్టి నోటిమాటగా ఏమీలేదని చెప్పినంతమాత్రాన ఏం లాభం?

## 52

రుక్కుకి జీవితం సుఖప్రదంగా సాగితీరుతుంది. చిన్న పిల్ల అవటంవల్ల కాదు; ఆడది అవటంవల్లనూకాదు; నాన్నకి ప్రియమైనకూతురు అవటంవల్లకాదు; పక్కింటి తెలితవిక్కువ జగ్గు స్నేహితురాలయినందువల్లనూకాదు.

అన్నింటివల్లనూ అనవచ్చు. కాని ఇందువల్ల అని ప్రత్యేకించి ఏదోఒక కారణంమాత్రం చెప్పలేము.

రుక్కులాంటి మనస్తత్వం, అలవాట్లు, సంస్కారంగల వాళ్ళకి నిర్లిప్తతకూడా అలవడితే, అన్నింటినీ ఏమీలేదని దూరంగానెట్టేసి పక్కకితొలగిపోగలగటం సాధ్యమే.

అలా ఒదిగి జీవించగలవాణ్ణి వేదాంతి అనీ, జ్ఞాని అనీ, గురునాథుడనీ ఆరాధించటానికిలోకం ఎప్పుడూ సిద్ధంగావుంటుంది.

అతిముఖ్యవిషయాల్ని, ఘాటంగానాటుకుపోయి, అనివార్యంగా ఎదురయ్యే విషయాల్నికూడా, "ఏం ఫర్వాలేదు" అనే ధోరణిలో పక్కకునెట్టి,తనూ ఓరగా ఒదిగి,జీవితాన్ని తనమట్టుకి ఆరోజు లాభనష్టాలకనుగుణంగా గడిపేయగలవాళ్లే లోకంలో మూడువంతులకి పైగావున్నారని నాకుతెలుసు.

మాయ, అసత్యం, మోసం, వేదాంతం— ఏమైనా పేరుపెట్టవచ్చు;—వాళ్ళలోచాలామంది వీటిని తప్పించుకొన్న వాళ్ళే. లేక తప్పించుకొన్నామని తప్పులెక్కలుకట్టుకుంటున్నారో! తప్పించుకోవాలన్న అభిలాషవుందివాళ్ళకి. తప్పించుకున్నా తప్పించుకున్నామనుకున్నా ఒకటే.

మానవసృష్టి అలాంటిది. సత్యం, అసత్యం, వాస్తవమైనదీ, మోసమైనదీ, ఏటినీరూ, ఎండమావులూ, ఇంచుమించు ఒక్కటే. భిన్నమైనవి కావు.

తప్పించుకొనడం, తప్పించుకున్ననని అనుకోడమూ ఒక్కటేనా అనడిగితే, లోకానికి సంబంధించినంతవరకు అంతేనని చెప్పాలనిపిస్తుంది నాకు.

తప్పించుకోలేము, తప్పించుకోడానికి ప్రయత్నించటమే తప్పుఅనినాలా అనుకునేవాళ్ళే అసాధారణమైనవాళ్ళు.లక్షమందిలో ఒకడైన నలాంటివాణ్ణి, తప్పించుకోడానికి వీల్లేనివిధంగా లోకం సుత్తితోబాది శిలలతో శిలువకు తాపడం చేసేస్తుంది. తప్పించుకోటం వీలుపడదంటూన్న నేనేమో "భావుకుడు", "సెమి" "పిచ్చాడు" అనే బిరుదులు తలదాల్చవలసివస్తూంది.

రోడ్డువెంట నడిచేమనిషి నవ్వుటూపోతున్నాడు.

కార్యకారణసంబంధాలేవీలేకుండా, గుంపుమధ్యనెట్టుకుంటూ, దిక్కూతెన్నూ లేకుండా, ఎందుకునడుస్తున్నదీ తెలియకుండా నడుస్తున్నాను.

## 53

ఇందరిమధ్యా నేనొక్కణ్ణే అసాధారణమైనవాణ్ణి, ఆలోచింపగలవాణ్ణి,ఇతరుల్లాంటివాణ్ణికానివాణ్ణి, కార్యకారణహేతువులేవీ పట్టించుకోనివాణ్ణి, ఎందుకోసం, ఎక్కడికిపోతున్నదీ తెలియక నడుస్తున్నవాణ్ణి—అనే ఎప్పుడూ ఊహించుకుంటాన్నేను. అలా ఉహించుకోటంలోని తీపినీ, చేదునీ ఏకంగానే అస్వాదిస్తున్నాను.

ఆ గుళ్ళోవిన్న అపస్వరాలు సన్నాయిపాటే, ఇంకోనాదస్వర విద్వాంసుడు స్వారస్యంగావాయిస్తున్నాడు.

చావుజ్ఞాపకాల పరంపరని దాటి చంపాలి, ధీమ్, ధీమ్ అంటూ మీదపడి గ్రుద్దాలి, ఎదురయిన మనిషి పీకనులిమి,హంతకుణ్ణవ్వాలి, అనిపించిందినాకు.

ఎదురయ్యేవాళ్ళల్లో ఎవరిగొంతు అలా నొక్కెయ్యడానికి వాటంగావుందా అని పదిపం్రెడెండుమందిపీకల్ని గమనించాను. పొడుగాటి గొంతులు, ఆభరణాలుధరించిన కుత్తుకలు, జిరాఫీ మెడలు, గొంతేకనబడని కుక్కిమెడలు, స్వరపేటికఉబ్బి పెద్దగా కనబడే గొంతులు, అసలు స్వరపేటిక ఆనవాలేకనిపించని గొంతులు—రకరకాలు కనిపించాయి.

వాళ్ళముఖాల్లోమట్టుకే వ్యత్యాసాలు ఉంటాయనటం సరికాదు. ప్రతిమనిషిగొంతూకూడా వేరుగానేవుంటూంది. అలా ఆలోచిస్తూపోతే మనిషిమనిషిలో ప్రతి అవయువము భిన్నంగానేవుంటుంది. అలా ఉండటమే సహజమనికూడా చెప్పవచ్చు.

అలాగే, మానవస్వభావాలు, పోకడలూకూడా భిన్నమయినవిగా వుండాలికదా?

అలాంటప్పుడు, నేనొక్కణ్ణే అందరిలాంటివాణ్ణికాను., అసాధారణమైనవాణ్ణి అనుకొని గర్వపడటానికి ఆధారం ఏముంది?

ప్రతిమనిషీ, ప్రాణీకూడా, ఒకవిధంగాచూస్తే తక్కిన మనుష్యులందరిలో, సర్వప్రాణికోటికీ భిన్నంగావుండక తప్పదు. ఈ మూలసూత్రాన్ననుసరించే లోకం అభివృద్ధిచెందుతూ, పురోగమిస్తూంది.

తక్కినవాళ్ళందరూ ఏదోబంధంలోంచి తప్పించుకున్న వాళ్ళని, నేననుకోవడం వట్టిమాయాభావనేనా? వాళ్ళల్లో ఎవ్వరూవిడివడలేదు,విడివడటానికి ప్రయత్నించనూ లేదు అన్నదే నిజమా? ఎందులోంచి తప్పించుకోవాలోకూడా వాళ్ళకి స్ఫురించి ఉండక పోవచ్చునేమో.

నా ఆలోచనల్ని అందరినెత్తిమీదా రుద్ది లాభమేమిటి?

ఆనాడు థగ్గులు టకటకా, జేబురుమాళ్ళు ఊపుకుంటూ, వేళ్ళు జిల్ జిలమంటుంటే,ఊళ్లమీద దండెత్తివచ్చి నానాబీభత్సం చేసేవాళ్ళట. ఆనాడు, ఆజన్మలో నేనోపేరుమోసిన థగ్గునేమో?

ఎవరిగొంతునైనా నొక్కెయ్యాలని నాచేతివేళ్ళిలా జిలజిలమనటం ఎందుకు?

నావేళ్ళని కంటికెదురుగా ఎత్తిపట్టి నిదానించి చూశాను-పొడవైన కాడల్లాంటి చేతివేళ్ళవి. కళాకారుడి వేళ్ళలాంటివి.

అవును, హంతకుడూ ఒకరకమైన కళాకారుడే!

## 54

బొద్దింకని వెల్లకిలాపడవేసి చూచారాఎప్పుడైనా? దాని కాళ్ళు గాలిలోకదులుస్తూ తలక్రిందులుగా సైకిలుతొక్కటం చూశారా? ఆబొద్దింకలా నాఆలోచనలకాళ్ళు వున్నచోటునుంచి కదలకుండానేసైకిలు తొక్కుతున్నయి.

నేను నడిచాను. చైనాబజారుదాటి, ఎలిఫెంట్‌గేటుదాటి రైల్వే బ్రిడ్జిదాటి, సాల్ట్‌కొటార్స్‌దాటి, చూళైదాకానడిచాను. ఇక్కడరద్దీగాలేదు. ఒకప్రక్క బోనులోచిక్కుకున్న సింహాలూ, పులులవంటి క్రూరమృగాల గర్జనలు, ఇంకోప్రక్క, విడివడ్డలేక విడివడటానికి సిద్ధంగావున్న రైలింజన్ల దీన్నపోతుఅరుపులు, రోడ్డుమీద దొర్లిపోతూన్న మోటరుకార్లు, బస్సులు, లారీలు వాటితాలూకు విచిత్రమైన రకరకాల హారన్‌లు, సైకిలుగంటలు, చేతిబళ్ళవాళ్ళగదమాయింపులూ, రిక్షావాళ్ళ టక్, టక్ శబ్దాలు, సైకిలురిక్షావాడి పొగరుబోతుమాటలు. ఇదే మద్రాసు మహానగరం బృందగానం.

నాలాంటి మనిషికానిమనిషికి తగిన బాక్‌గ్రౌండ్ మ్యూజిక్కే; సందేహంలేదు.

గుంపుల్నిదాటి వచ్చేసింతర్వాత , ఎలిఫెంట్‌గేటుమలుపు తిరిగినవెంటనే, నాలో హత్యాదాహం అణిగిపోయింది. నాచేతివేళ్ళు కలంపట్టుకోడానికి జిల్ జిలమంటున్నయ్యేగాని, ఎవరిగొంతునీ నొక్కెయ్యాలని ఇప్పుడు ఉబలాటపడటంలేదు.

ఏదో వ్రాయాలని జిలజిలమంటున్నయి నాచేతివేళ్ళు. హేమకొక ప్రేమలేఖ వ్రాశాను మనస్సులోనే. ప్రేమసంగీతం అలాపిస్తుండగా, చెన్నపట్నం బృందగానం బాక్‌గ్రౌండ్‌మ్యూజిక్‌లా ధ్వనింపగా, నేను ఒక్కొక్కవాక్యమే వ్రాసుకుంటూ, పాడుతూ నడిచాను. రెండోవాక్యంఆరంభించేటప్పటికిమొదటివాక్యం మరచిపోతున్నాను. అయినా, నష్టమేమిటి ? రచనచేయడంలో సుఖంగొప్పదేకదా? ఎవరికంట్లోను పడకపోయినా, ఉదాత్తమైన సాహిత్యమేకదా! అలాగే, నాప్రేమలేఖ హేమకి అందకపోయినప్పటికీ, అందులో లేఖాస్వరూపం, ప్రేమస్వరూపం, కవిత్వం, సంగీతం—ఇవన్నీ ప్రస్ఫుటంగా వున్నాయి.

ప్రేమలో ఆకర్షణే ఎక్కువో, ఏవగింపుఎక్కువో నేను తీర్మానించు కోలేకపోయాను.

బొద్దింక ఏవగింపుకలిగించే పురుగే. కాని అది వెల్లకిల పడింది, గాలిలోకాళ్ళూపుతూ సైకిలుతొక్కడం నేనుచూడకుండావుండలేను. ఒకవిధమైన ఆకర్షణవుంది అందులో!

హేమది ఆకర్షణ అనుకుంటే, హేమతల్లిదిఏవగింపు అని అనుకోవచ్చా? ఏ ఆధారంమీద ఈరెండూ నమ్మాలోమాత్రం తెలీటంలేదు.

రెండూ బయటికనుపించే అర్థంలేని స్వరూపాలేనా?
రెంటినీ మరచిపోవడం మంచిదా!

లేఖలో, నాప్రేమలేఖచివరిపేరా శూర్పణఖకూతురా అంటూ ప్రారంభించాను.

ఆలేఖ నిజంగానే ఆమెచేతికి అందివుంటే హేమ ఏమనుకుంటుందో వూహించుకుంటూ, రండాల్ రోడ్డుమీదుగా, వేపేరిదాటి రిప్పన్‌బిల్డింగ్స్ చేరుకొని, మూర్‌మార్కెట్‌దాటి, శ్మశానపుతోట, వంతెనాదాటి, మవుంట్‌రోడ్డుమార్గంగా వాలాజారోడ్డుకివచ్చి, వెంకటరంగంపిళ్ళై వీధి చేరుకున్నా.

పెద్దపెద్ద ఔట్లూ, మేళతాళాలు, బాణసంచా, తిరువాచకంపారాయణం, వీటితో పూలవాసన్లూ, పొగలుకక్కుతున్న నిప్పుకుండా—ఇంతసంరంభంతో ఎవడో చివరిప్రయాణం సాగిస్తున్నాడు. చల్లగా ఆ వూరేగింపులో కలిసిపోయాను.

## 55

జీవితయాత్రముగించుకుని, పూలపల్లకిలోకాళ్ళుచాపుకు పడుకున్న ఆవ్యక్తికి, మనశ్శాంతి లభించింది.

నాకు అంతసులభంగా మనశ్శాంతి దొరుకుతుందా?

వాకిట్లో, రుక్కునిలబడి ఆశవవాహనం వూరేగింపుని వేడుకచూస్తోంది.

“ రాత్రి తొమ్మిదింటికి, తలుపుతీసిపట్టుకుని వేడుక చూట్టం ఏమలవాటే? ” అని రుక్కుని కసురుకుంటూ లోపలికి వెళ్ళాను.

నామట్టుకినేను అసాధారణుణ్ణిగావుండటానికి సిద్ధమే. శవాలవూరేగింపుల్లో కలిసిపోయి, ప్రేతమనశ్శాంతి తాత్కాలికంగా నయినాపొందటానికి ప్రయత్నించటం నామట్టుకు బాగానేవుంది.

కాని, చెల్లాయి రుక్కు సాధారణ ధోరణిలోవుండాలి అంటాను. హేమ నాభార్యగావచ్చేట్టయితే ఆమెకూడా సాధారణురాలిగానే వుండాలి.

కాని, శూర్పణఖకూతురు ఎలావుంటుంది?

ఈ విషయం రామాయణంలోకూడా ఏమీచెప్పలేదే అన్న విచారమే నన్ను పీకిస్తోంది.

ఏలక్ష్యమూ లేకుండా నేను రోడ్లవెంటబలాదూరు తిరిగి రాలేదని చటుక్కున స్ఫురించిందినాకు. ఏదిక్కుకి నడచివెళ్ళినా, రాత్రి తొమ్మిదింటికో పదింటికో, పదకొండింటికో నాఇల్లనే లక్ష్యం ఒకటి నన్ను ఆహ్వానించడానికి సిద్ధంగావుంది. నాఇంటివేపుకే ఇంతవరకూ, ఈఐదుగంటల సేపూ నాకు తెలియకుండానే నడిచాను.

రుక్కు ఎదురుచూస్తోంది నాకోసం.

పెళ్ళినిశ్చయమైతే, జాతకాలుకుదిరితే, పెద్దలుమాట్లాడే ఇతరలౌకికవిషయాలుసరిపోతే, ఇకమీదట హేమ ఎదురు చూస్తోంటుంది.

నేను అసాధారణత్వంఅనుకుని ఇంతవరకూమనస్సులో కట్టుకున్నకోటలూ, బురుజులూ— అన్నీ వట్టిగాలిమేడలే. నాఆలోచనలు కేవలం నిరాధారమైనవేనేమో! నేను చల్లని నీటికొలనుఅనుకొని వెతుక్కుంటూవెళుతూన్నది వట్టి ఎండమావేకావచ్చు.

నేనూ సాధారణమానవులమధ్య సాధారణమానవుణ్ణే! నేనే స్వయంగాఇష్టపడి చెఱశాలగోడల్ని ఏర్పరచుకుని, ద్వారాలన్నీ గట్టిగాబంధించి, ఖైదీనై పోవటానికి సిద్ధంగావున్నానని ఇప్పుడు నాకేస్పష్టమైపోయింది.

అసాధారణుణ్ణి అని ఇంకాగింజుకుని లాభమేమిటి?

ముక్కుకోసుకున్న ముక్కరయ్యకథ వాస్తవమైన మనస్తత్వశాస్త్రపునాదిమీద ఏర్పడిందే. ఊళ్ళో వున్నవాళ్ళందర్నీ ముక్కరయ్యలుగా మార్చటానికి ముక్కరయ్య ప్రయత్నించటం న్యాయమే. అలాగే నేనసాధారణుణ్ణైనప్పుడు, ఊళ్ళోవాళ్ళందర్నీ అసాధారణమైనవాళ్ళనిగా మార్చటానికి ప్రయత్నించటం మానుకోను? ఇందుకువిరుద్ధంగా రుక్కుని ''ఏమిటే వేడుక చూస్తున్నావ్? పో, లోపలికిపో!'' అనిమందలించాను. విచిత్రమే!

## 56

మానవుడు విమోచనంకోసంప్రయాసపడుతున్నాడనటం నిజంకాదనే అనిపిస్తోంది. విమోచనం కావలసివస్తే, నివసించడానికంటూ ఇళ్ళుకట్టుకుంటాడా?

రమ్యమైన రాజభవనమే కానీండి——అదీ ఓరకమైన చెఱశాలేకదా!

మానవుడు విమోచనంకోరుతాడని గట్టిగా చెప్పలేం. ఒక చెఱశాలనుంచి ఇంకోచెఱశాలకి పారిపోవటానికి ప్రయత్నిస్తున్నాడనుకోవచ్చు.

బ్రతికున్నప్పుడు చనిపోవటమే విమోచనంలాతోస్తుంది. చచ్చింతర్వాత జీవితమేవిమోచనంలాతోస్తుందేమో!—కాదూ మరి? కాదని ప్రాణంతోతిరిగివచ్చి, మనకి చెప్పినవాళ్ళెవరు?

పగటినుంచి రాత్రికి, రాత్రినుంచి పగటికి, జాగ్రదవస్థనుంచి నిద్రలోకి, నిద్రలోంచిజాగ్రదవస్థలోకి, ప్రత్యక్షజీవితంలోంచి కలలలోకి, కలలలోంచి ప్రత్యక్షజీవితానికీ, నీటిపట్టునుండి ఎండమావికి, ఎండమావినుంచి నిజమైన నీటిపట్టుకి——ఇలా పరిభ్రమిస్తూ ప్రాకులాడుతున్నాడే మానవుడు;—దేనికిదంతా? భట్టివిక్రమార్కుడిలాగ రాజ్యంలో ఆర్నెల్లు, అడవుల్లో ఆర్నెల్లూ గడుపుతూ జీవితకాలాన్ని పొడిగించుకోవాలన్న అభిలాషవల్లనా? ఏదినిజమో ఎప్పటికైనా తేలుతుందిలే అనే ధీమావల్లనా?

ఏది చెఱశాల?

ఏది విమోచనం?

ఏది స్వాతంత్ర్యం?

ఏది బానిసత్వం?

ఎవరైనా తేల్చిచెప్పగలరా?

చనిపోవటమే విమోచనం అనేటట్టయితే జీవించటానికి ఇన్ని అగచాట్లెందుకు?

అసలు ఇంకోప్రశ్నకూడావుంది. మానవులు విమోచనమే కోరుతారు, కోరుతున్నారు అని నిశ్చయంగా ఎవరుచెప్పగలరు?

చెఱశాలబ్రతుకుకూడా అలవాటైతే, అక్కడా ఏదో చిలకపావాసం దొరికితే, అదీ ఆ చెఱశాలబ్రతుకు నలిగినబాటలో నడయాటడమే అవుతుంది.

విమోచనంకోరేవాడు ఎప్పుడూ నూతనసత్యాలను అన్వేషించాలి,—క్రొత్తదారులువెతుక్కోవాలి—నూతనభావాలు ఆలోచించాలి, నూతనానుభవాలు ఆశించాలి. వీటికన్నిటికీ తగినంత వోపిక, ఉత్సాహం ఎవరికుంది?

విమోచనంతాలూకు నిబంధనలు నిర్బంధాలుకావు; సులభమైనవీకావు. విమోచనం అన్నది చాలాచిక్కువిషయమే. మానవుడు చెఱశాల్లోనే ఏదోవిధంగా గడిపేయడానికి ప్రయత్నించడంకూడా న్యాయమనే చెప్పాలి.

## 57

మా ఇల్లనే నా చెఱశాల్లో ఆరాత్రి ఎలాగో గడిపేశాను. మర్నాడు కళాశాలనే చెఱశాల్లోకి వెళ్ళడానికి ఇష్టంలేదు. డ్యూమాస్ నవలొకటి పదోసారిచదువుతూ మధ్యాహ్నం కాఫీవేళదాకా కాలంవెళ్ళబుచ్చాను.

పక్కింటి తెలిగితక్కువజగ్గని పెళ్ళిచూపులు చూడ్డానికి ఎవడోవస్తాడని, రుక్కుఆరోజంతా హుషారుగా లేదు. మా రుక్కునీ పెళ్ళిచూపులుచూడ్డానికి ఇలాగే ఎవడైనా, ఏనాడైనా వస్తాడేమో? "రానీలేచూద్దాం!" నాలో నేనేగొణుక్కున్నాను.

సాధ్యంకాని పనులుకూడా సాధ్యమే అనుకున్నప్పుడే ఏపనయినా చెయ్యొచ్చునని నాకూతోస్తుంది. రుక్కుని వెదుక్కుంటూ వచ్చేవాడు "ఎవడోరానీలేచూద్దాం" అంటూ గొణిగాన్నేను. నేనీసంగతి రుక్కుతో దాపరికంలేకుండాచెప్పాను. అన్నీతెలిసినట్టొక నవ్వునవ్వి మాట్లాడకుండా వెళ్ళిపోయింది రుక్కు.

నేను మాటల చెఱశాల్లో బంధించబడ్డవాణ్ణి. మాటల్ని వదులుకొని తప్పించుకుందామని నేనెంతప్రయత్నించినా నాచేత నవటంలేదు.

మాటల్నినమ్ముకునే జీవిస్తున్నాన్నేను.

మాటలే ఆలోచనలు అనే నిత్యసూత్రాన్నివల్లిస్తూ రోజులు వెళ్ళబుచ్చేస్తున్నాను.

గాలిమేడలకి పునాదులుండవు. నాగాలిమేడలనిర్మాణానికి ఉపకరించేసామగ్రి కేవలం మాటలే.

మాటల్నిడబ్బులుగావాడుకుంటూ, నేనీ పద్దెనిమిదిసంవత్సరాలూగడిపేశాను. ఇకమిగిలినజీవితం పద్దెనిమిదో, ముప్ఫైఆరో, యాభైనాలుగో–అదీ అలాగే గడిచిపోతుంది.

పెళ్ళి నాకెందుకు అవసరం?

నేను నాలుగన్నరరూపాయ లిచ్చికొన్న అనుభవంసంగతి మావాన్నగారికి తెలిసిపోయిందని నాకుతెలుసు. అయినా ఆపక్కింటికివస్తూ పోతూఉంటారుకదా?

అంచేతే తొందర పడుతున్నారా?

లేక, హేమనిచూడగానే నాలోప్రేమోదయమయిందని, ఇహపూరుకుంటే వ్యవహారం విషమించిపోతుందని భావించారా?

లేకపోతే, తనస్నేహితుడిమేనకోడలు, నాకు తగినవయస్సుగలపిల్లదొరికిందిగదా, ఇంకా కాలయాపన ఎందుకని అనుకున్నారేమో?

ఏకారణమయితేనేం? వ్యవహారం ముదిరింది. రుక్కు చెప్పిందాన్నిబట్టి జాతకాలదాకావచ్చేసింది.

పెళ్ళిచేసుకోటానికి నాకేమీఅభ్యంతరంలేదు. ఒక రోజంతాపస్నాయివాయించేస్తారనే భయంతప్ప,నాకుపెళ్ళి చేసుకోడానికి వేరేఅభ్యంతరం ఏమీలేదు.

అదీ, హేమలాంటిపిల్లదొరకటం—నేనదృష్టవంతుణ్ణే.

మరి, ఆమెతల్లి.......ఆశూర్పణఖ సంగతేమిటి? ఇదే నన్ను కలవరపరిచేస్తూన్న సమస్య.

## 58

నేను వెంకటనారాయణారోడ్డుమీద ఆఇల్లుచేరుకునేటప్పటికి మూడున్నరగంటకొట్టింది. ఆవేళకు హేమ కాలేజీలో వుంటుంది—ఇంట్లోవుండదనితెలుసు. ఆమెతల్లిని కలుసుకోవాలనే వెళ్ళాననిచెప్పాలి.

ఆమె అదే ఉయ్యాల్లో, నిన్న నేను వదిలిపెట్టిపోయిందగ్గర్నుంచి అలాగే కదలకుండా కూచునిఉన్నట్టు ఉంది—రవివర్మ చిత్రంలో మోహినిలాగ.

"రా!" అన్నది.

నేనొస్తానని తెలిసే ఆవిడ ఎదురుచూస్తున్నట్టుతోచింది.

"వచ్చేశా!" అన్నాను.

ఉయ్యాల మెల్లగాకదిలింది. ఎదురుగ్గా పేముకుర్చీకి బదులుగా, మెత్తని తల్లిగర్భకోశపు వెచ్చదనాన్ని, మృదుత్వాన్ని జ్ఞాపకంచేసే ఆ సోఫావుంది. అందులోకూచున్నాను.

హేమ ఇంట్లోవుండదనితెలిసే వచ్చాన్నేను. ఎందుకు ? దేనికోసం? అని నన్నే ప్రశ్నించుకొన్నాను.

ఎన్నటికీ విడివడని, జవాబేలేని చిక్కుప్రశ్నలవేసుకుంటూ తలకు తంటాలుతెచ్చిపెట్టుకోటంలో పులినినేను.

దేవుడనేవాడంటూవుంటే, ఆతడు మానవులనే విద్యార్థులెవరూ జవాబులు చెప్పలేని ప్రశ్నాపత్రాల్ని తయారుచేసి, అందర్నీ తికమకలాడించే "ఎక్సు"లాంటివాడే అయ్యుండాలి.

ఎన్నోప్రశ్నలకి జవాబులేనేలేవు. కనుక ప్రశ్నలువేయుటమే తెలివితక్కువ తనమని చెప్పొచ్చు. అయినా, ప్రశ్నలువేస్తూ, కాలాన్నివెళ్ళబుచ్చుతున్నాడు మానవుడు; పాపం! వేదాలకి,బైబిలుకి పూర్వతరాలవాళ్ళు, జొరతుష్ట్రుడు, చైనాదేశపులావోజె, కన్ఫూషియస్సు, శిలువపై మరణించిన ఏసుక్రీస్తు—అందరూ ఒకరి తర్వాత ఒకరు జవాబుల్లేని ప్రశ్నలు శరపరంపరగా కురిపించి మానవచరిత్రలో సుప్రతిష్ఠితులైపోయారు.

నమ్మేవాళ్ళని నమ్మనీండి. వీళ్ళందరి ప్రయత్నాలవల్ల మానవసంతతి చివరికి బావుకొన్న పెద్దప్రయోజనమేమిటని ప్రశ్నిస్తే.........?

దానికీ జవాబుదొరకదే!

నా ఆలోచనలు ఏలక్ష్యంవైపూ నిలకడగా సాగడంలేదు.

ఎదురుగా, ఉయ్యాలలో ఉల్లాసంగా ఊగుతున్న, ఆరంజ్ కలర్‌చీర, పచ్చరవిక తొడుక్కున్న ఆవిడకీ, నాకూ ఏమిటి సంబంధం? ఆమె ఎవరో? నేనెవరో? లేని సంబంధమేదో కల్పించుకుని నేనవస్థపడటం ఎందుకు?

నాకళాకారుని చేతివేళ్ళు ఆమెనిచంపడానికి జిలజిల మంటున్నయి.

శూర్పణఖా జాగ్రత్త! అంటూ ఆమెను, లక్ష్మణుని ధోరణిలో హెచ్చరించాలనుకున్నాన్నేను.

కాని, నేను లక్ష్మణుణ్ణికాను. రాముణ్ణిగద!

పైగా, శూర్పణఖ నన్ను వెదుక్కుంటూ రాలేదు. ఆమెను వెదుక్కుంటూ నేనే వచ్చాను ఇప్పుడు. ఏ ఉద్దేశంతో వచ్చానో నాకునిశ్చయంగా బోధపడలేదు.

## 59

నేనావేళ అక్కడికివెళ్ళి చిక్కుకోవడం తప్పని నాకుతోచింది.

ఇక మళ్ళీ అలా పారిపోకూడదు.

అక్కడేవుండి పరిష్కరించాల్సిందే.

"నీకు జవాబు చెప్పడానికి వచ్చాను," అని ధైర్యంగా ప్రారంభించి, ప్రేమనుగురించి ఆమె అడిగినప్రశ్నకు, నాకు తెలిసిన జవాబు చెప్పేయడం మంచిదే! ఆమెను చూస్తున్నకొద్దీ నాకు ధైర్యం చాలటంలేదు. మాట్లాడటానికి నోరు పెగల్లేదు.

ఏదో అబద్ధం చెప్పటానికి నోరు కదిపాను. "హేమ మామగార్ని మానాన్న, వెంటనే పిలుచుకురమ్మన్నారు." అన్నాను.

హేమతల్లి మెల్లగా ఉయ్యాలఊగుతూ అన్నది: "నిన్న సాయంత్రం తంతివచ్చింది-ఊళ్లో ఎవరికో ఒళ్ళు బాగాలేదుట. మా తమ్ముడు విశ్వనాథం ఊరికివెళ్ళిపోయాడు. తిరిగి రావడానికి వారం పదిరోజులవుతుంది.

"సరే!" అని లేచి తిరిగొచ్చేయ్యాలికదానేను. అలా చేయక సోఫాలో ఇంకాపదిలంగా జరిగి, ఆనుకుని కూచున్నాను.

"హేమ కాలేజికి వెళ్ళింది. నువ్వు వెళ్ళలేదా?" అన్నది.

"ఈ రోజు ఎగ్గొట్టేశాను." అన్నాను.

ముంగిట్లో కారుశబ్దం వినబడింది.

"మనకారే! హేమే! పెందరాళే వచ్చేసిందే!" అన్నది హేమతల్లి,ఉయ్యాల వదిలి కిందికి దిగకుండా, నడవకేసి చూస్తూ.

"తప్పించుకొనడం సాధ్యంకాదు! అదీమంచిదే" అనుకున్నాను. తప్పించుకోటం నాకు ఇష్టంలేదు. ఆ విషయం స్పష్టంగానే తెలుసు నాకు.

ఎవరో నడిచివస్తున్నారు. బూట్లశబ్దం వినబడింది. హేమ ఒక్కతేకాదు; ఆమెవెంట ఎవరో మగవాడు వస్తున్నట్టుంది. హేమ, హేమని వెంబడిస్తూ ఒక యువకుడు లోపలికొచ్చారు.

నేనాసమయానికి అక్కడుంటానని హేమఅనుకొని ఉండదని ఆమెముఖం చూడగానే తెలిసింది. ఆమెబుగ్గ కాస్త కందింది;-కొద్దిగా ఎరుపెక్కింది. సిగ్గనో, ఆశ్చర్యమనో, ప్రేమనో, తడబాటనో స్పష్టంగా ఏదీ చెప్పలేనిభావం ఆమె ముఖంనిండా వ్యాపించింది.

హేమకూడా ఆమెతల్లిలాంటిదేనని, నాకాసమయంలో నిశ్చయమైపోయింది.

శూర్పణఖ కూతురు! తాటకి వంశం! అసురగణం!

ఆమె వెంటవచ్చిన యువకుణ్ణిచూశాను. అందంగా, చెరగని, ఎగదువ్వినక్రాపింగు, నలగని దుస్తులతో సాక్షాత్కరించాడతను. ముఖంలో తెలివి, తెలివి తక్కువతనం రెండూ కలసిన అలక్ష్యమైన అందం కనిపిస్తోంది. వాడి నడక, దుస్తులు చేష్టల్లో ఒకవిధమైన ధీమా స్థిరపడిపోయినట్టు కనబడింది. తను చేసే ఏ పనిగురించీ, ఒక్కసారైనా ఆలోచించి పస్తాయించే రకం కాదతను.

## 60

ఒకటి రెండు నిమిషాలు నిదానించిచూసిం తర్వాత, వాడు నాతో-మా క్లాసులో-చదివేవిద్యార్థి చంద్రశేఖర్ అని జ్ఞాపకం వచ్చింది.

వాణ్ణి విద్యార్థి అనటంకన్న, ఆటగాడు అనటంమంచిది. చదువులో ఏ క్లాసులో కడపటివాడు వీడే. ఆటలపోటీల్లో మా కాలేజీకి వాడే మొనగాడు.

హేమతల్లి వాణ్ణి ఆహ్వానించింది. "రా చంద్రశేఖర్, రా" అంటూ తనకి చాలాపరిచయమున్నట్టు పిలిచింది. వాడూ ఆ ఇంటికి తరచు వస్తూపోతున్నవాడేనేమో!

"నాలాగ," అని నేనే చేర్చుకున్నాను.

నిమిషంలో హేమ తన్నుతాను సంబాళించుకుంది. ఆమె నే నక్కడఉంటానని అనుకునిఉండదు. అయినా నే నక్కడ కూచుని ఆమెతల్లితో మాట్లాడుతూండటం సర్వసామాన్యమైన విషయంలాగ, బాగా అలవాటుపడిన విషయంలాగ, అభినయించింది. "ఇప్పుడే వచ్చారా? మీకు చంద్రశేఖర్ తెలుసు కదూ?", అని లాంఛనంగా అడిగింది.

చంద్రశేఖరానికే నన్నక్కడ కలుసుకోవడంగురించి ఏమనుకోవాలో తెలియలేదు. వేరే ఎవర్ని కలుసుకున్నా వాడికి బాగానే వుండేదేమో. ఈ "సెమి" హేమని వెతుక్కుంటూ రావటం వాడికి ఆశ్చర్యంగానే వుండుంటుంది.

అర్థంలేని సాంఘిక ఆచారాలుఎన్నో, "నమస్తే" "కరచాలనాలు" "బాగున్నారా?"—ఇవన్నీ ఆలోచనల తడబాటుని కప్పిపుచ్చడానికే ఏర్పడ్డాయని చెప్పాలి.

"How are you?" అని ప్రశ్నిస్తూ ముందుకు వచ్చి, మా ఇద్దరిమధ్యా ఎన్నడూలేని స్నేహాన్నభినయిస్తూ నా చెయ్యిపట్టుకుని ఊపాడు చంద్రశేఖర్. ఏదో విచిత్రమైన సౌదర్యాన్ని నెలకొల్పగోరుతున్నాడేమో—అందగత్తె హేమని వెంబడించే యువకులసంఘమని దానికి పేరుపెట్టవచ్చుగా!

"కూచో చంద్రశేఖర్" అన్నది తేనెలుచిందే కంఠస్వరంతో హేమతల్లి. నాకన్నా వాడు తనకి నచ్చినవాడని తనకంఠస్వరంతో తెలియపరచగోరుతూందామె, అనిపించింది నాకు.

చంద్రశేఖర్ నాఎదురుగుండావున్న కుర్చీలో కూచున్నాడు. ఉయ్యాలలో ఊగుతూన్న "పెద్దమ్మ" కేసి భయభక్తులతో చూశాడు.

అట్టి భయభక్తులప్రదర్శన నాకెప్పుడూ చేతకాదు. కాకూడదనే ఎల్లప్పుడూ నా కోరికకూడా.

నీస్నేహితుడు గట్టివాడని హేమ చెప్పింది. నిన్నడిగిన ప్రశ్ననే, వీరినీ అడిగాను. బదులు చెప్పడానికి, నిన్న వెళ్ళి, ఈరోజు వచ్చారు", అన్నది ఉయ్యాల కొంటెగా ఊపుకుంటూ.

"కాఫీ తెమ్మంటాను", అంటూ హేమ, వెనకగదితెరలోంచి దూసుకుని మాయమై తప్పించుకుంది.

## 61

నాలో కోపమేఘాలు ముసురుకుని విజృంభించాయి. ఘర్షణ పడుతున్నయి.

"నే నడిగినప్రశ్న తెలుసుగా! ఆరోజు చెప్పిన జవాబు మళ్ళీ చెప్పు", అన్నది హేమతల్లి. చిరునవ్వు ఆమె పెదవిఅంచుల్లోంచి కొంటెగా తొంగిచూస్తూంది.

వయస్సుకి తగనిప్రశ్న! వయస్సుకి తగని ధోరణి! వయస్సుకి తగని చిరునవ్వు!

ఓహో! ఇదివరకెప్పుడో మాట్లాడేసిన సంభాషణా అనుకున్నాను.

దార్లో వచ్చిపోయేవాళ్ళని నిలేసి ఏదోప్రశ్నవేసి అటకాయించేదట ఒక స్పిన్క్స్. అలాగే, తనింటికి వచ్చేపోయే వాళ్ళందర్నీ ఇదే ప్రశ్న వేస్తూంటుందా ఈమె?

ఆ స్పిన్క్స్‌కి సగం స్త్రీరూపం, సగం జంతు రూపంట. ఈమె సగం మనిషి, మరోసగం రాక్షసి! ఆకర్షణీయమైన రాక్షసే...శూర్పణఖలా అందెగత్తెలా వేషం వేసింది.

ఈ సంగతి తెలిసే రవివర్మ మోహినిని వయస్సు ముదురుతూన్న, అందంవోడుతూన్న స్త్రీలాగ, ఉయ్యాల్లో కూచోబెట్టి చిత్రించాడని చెప్పాలి. వాస్తవమైన చిత్రమే అది. మోహిని ఇలాగే వుంటుంది; మోహినీపిశాచి ఇలాగే మనస్సుని ఆక్రమించుకుంటుంది.

"మీకు తెలియదా? వయస్సు మళ్ళిందే! ఇంకా వయస్సు వచ్చీరాని మమ్మల్ని అడుగుతున్నారేం? మాకు నేర్పవలసినవారు గదా మీరు!" అని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పేద్దామా అనుకున్నాను.

"నేర్పుతా—రా", అని సవాలు చేస్తే...! ఏం చేయటం?

చంద్రశేఖర్ ఆలోచించటం అంటే ఏమిటో ఎరగనివాడు—వాడు జంకకుండా "పరిశుద్ధమైన రెండుమనస్సులు ఏకం అవటమే ప్రేమ." అని "పాఠం" అప్పజెప్పినట్టు చెప్పాడు.

చాలా సులభమైన జవాబు. నేనూ నిన్న సులభంగా అదే చెప్పేసి వుండవచ్చు.

మనస్సులు ఏకమైపోతే, శరీరాలూ ఏకమైపోవల్సిందే గద!

పాపం! మానవుడు ఎన్నో అబద్ధాలు సృష్టించుకుని, వాటి నీడలో జీవించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ మాయనీడల్లో ఈ ప్రేమకూడా ఒక మాయే. కళాకారులందరూ ఈ మాయాస్వరూపానికి తరతరాలుగా సాహిత్యపుమెరుగులుదిద్ది, వన్నెచిన్నెలు కూర్చారు.

ప్రేమ జనించటానికి రెండుమనస్సులు కావాలి. రెండు శరీరాలూ అవసరమే. పరిశుద్ధత కావాలి. ఏకమైపోవడం అవసరం. భేష్ !

రాజకీయాలు, ఆర్థికశాస్త్రాలు మాత్రమే నిజాలనుకుని నమ్ముతూ జీవించయత్నించే నేటిమానవులకి మనస్సు లున్నయ్యా? పరిశుద్ధతఅంటే ఏమిటో తెలుసా? లేక, తాను లయమై మరొకరితో ఏకత్వంపొందటం అనేస్థితి ఏమిటో వీళ్ళకి అర్థమవుతుందా?

రాత్రికొక సినిమా చూస్తూ, రోజుకొక సినిమాతార నారాధిస్తూ కాలంగడిపే నేటియువకుడు చంద్రశేఖర్. వాడికి ప్రేమనిగూర్చి తెలియనిదేముంది ?

## 62

కోపం నాలో అగ్నిలా ప్రజ్వరిల్లింది.

''ఈ రోజుల్లో పరిశుద్ధమైన మనస్సులంటూ లోకంలో వున్నయ్యా?'' అని అడిగాను.

త్రుళ్ళిపడి, నాకేసి చూశాడు చంద్రశేఖర్. నే నడిగింది వాడికి అర్థం కాలేదు. నిజమే. ఎలా అర్థమవుతుంది?

''పవిత్రమైనమనస్సు అన్న విషయం—మిగిలిన ఎన్నో పవిత్రమైన విషయాల్లాగే–కట్టుకథ!'', అన్నాన్నేను. ''పవిత్రత మీదకాని, మనస్సుమీదకాని నమ్మకంకలిగినవాళ్ళు ఈ కాలంలో ఎంతమందున్నారు? నీకు నమ్మకం వుందా చెప్పు!'' అన్నాను.

''సరైన ప్రశ్నే'', హేమవల్లి ఆమోదించింది.

నా వాదాన్ని ఆమోదించే వాళ్ళంటే నాకు ఎప్పుడూ అసహ్యమే గద! ''శూర్పణఖ! రాక్షసి!'' అని మనస్సులోనే తిట్టుకున్నాను.

''శరీరాలు కలిసిపోవటానికి ప్రయత్నించవచ్చు. కాని మనస్సులు కలిసిపోతాయనటం వట్టి మోసం, అబద్ధం'', అన్నాను అక్కడితో వదలక.

''ప్రేమ అన్నది ఒకపవిత్రమైన భావం'', అన్నాడు చంద్రశేఖర్.

''వట్టిమాటలు!'' అన్నాను. ''పవిత్రతని గూర్చి మానవ సంతతి సందేహించటం ఎన్నోతరాలక్రిందటే ప్రారంభ మయింది!'', అన్నాను.

ఉయ్యాల ఊపటం ఆపేసి, నేను చెప్పింది శ్రద్ధగా విన్నది హేమవల్లి. రాక్షసే ఆమె! సందేహంలేదు! అసురగణానికి చెందినదే!

ఆమె గొంతునొక్కిపట్టి, నులిమెయ్యాలని నా చేతివేళ్ళు జిలపుడుతున్నయి.

ఆమె గొంతుఅందం ఇంకా చెదరకుండా వుంది. నాలుగు వేళ్ళతో బిగించి, నొక్కిపట్టడానికి చోటుంది. కంఠస్వరం ఆగి పోయేటట్టు నొక్కి పట్టకుంటే......

''ప్రేమ కేవలం పిచ్చిఊహా! గుడ్డినమ్మకమా ?'' చంద్రశేఖర్ అడిగాడు.

''ప్రేమనినమ్ముకునే కవులందరూ తమ జీవితాన్ని ధారపోశారు. తమ కావ్యాలకి జీవంపోశారు. ప్రపంచంలో ఎన్నో మోసాల్లో ఈ ప్రేమకూడా ఒకటి!''

''సెభాష్!'' అంటూ శూర్పణఖ నేలతన్ని ఉయ్యాల ఊపింది.

## 63

చంద్రశేఖర్ జవాబు చెప్పలేదు.

నేనే మాట్లాడాను. ''కాలం అనే భ్రమలాగే ప్రేమ కూడా, మనం మనకోసమే, సృష్టించుకున్న అబద్ధం. ఆ అబద్ధం మనకు అండగా లేకపోతే, జీవితమే సాధ్యంకాదేమో అనిపిస్తోంది. సాహిత్యంలోమాత్రమే ''నిజంగా'' కనిపించే ఒకఎండమావిని పట్టుకొని, మనం నిజమైన నీటిపట్టుగా మార్చుకోటానికి ప్రయాసపడి మోసపోతున్నాం!''

చంద్రశేఖర్ పూర్తిగా చిత్తైపోయాడని అర్థమైంది నాకు. ఇదేమీ అర్థంకాక అవస్థపడుతున్నాడని కనిపెట్టాను.

''లోకంలో సుఖాలన్నీ నిజమైనవే అని నేను నమ్ముతాను, వాటిలో ప్రేమసుఖం ఉదాత్తమైంది అని భావిస్తున్నాను. నాలా ఎందరో అలాగే నమ్ముతున్నారని నాకు తెలుసు.'' అన్నాడు చంద్రశేఖర్.

ఆకులు నమలటమంటే మేకలకి సరదా. అలాగే మాన వులకు ''సుఖమే లేదని త్రోసిపారవేస్తున్నావా?''

''శరీరసుఖం వుంది. లేదని ఎవరు చెప్పగలరు? దాన్ని అంగీకరించటానికి నిరాకరించి, లేని ప్రేమసుఖాన్ని ఆరాధించటం తెలివి తక్కువనే చెబుతున్నాను'', అన్నాను బాగా నొక్కి నొక్కి మాట్లాడుతూ.

దీనికి ఎవ్వరూ జవాబుచెప్పక పోవడంతో, నేనే రెండునిమి షాల్లో మళ్ళీ ప్రారంభించాను : ''లోకంలో ఎన్నోకావ్యాలు ఫలించని ప్రేమనే వర్ణిస్తున్నయి. అందనంతవరకే ఆ భావానికి ప్రేమ అన్న పేరు సరిపడుతుంది. హెలన్ పరపురుషుడితో లేచిపోయినావిడ, పతిత అని తనకుతెలిసుండికూడా మెనిలాస్ఆమెను స్వీకరించడానికి ఇష్టపడ్డాడని, హోమరు మనకి నమ్మకం కలుగజేస్తాడు. మహర్షి వాల్మీకికి అలా సాధ్యం కాలేదు. సీత పతివ్రతే అని తెలిసుండికూడా రాముడామెను అగ్నిపరీక్ష చేశాడని సమర్థించాడు. వీటకన్నింటికీ విశేషార్థాలు వున్నాయికదా!''

దీనికీ జవాబులేదు.

''ఈతరం కవి అన్నట్టు..........''

హేమతల్లి అడ్డువచ్చింది. ''నాకు కవిత్వం అంటే చాలా ఇష్టం. ఏదైనా కవిత్వం చెప్పండి!'' అన్నది.

నాలో కోపం కలిగింది. ఒళ్ళుమండింది.

''Does the imagination dwell the most upon a woman won or woman lost?''

("ఆకట్టుకొన్న ఆడదాని చుట్టూనో
పోగొట్టుకొన్న ప్రియురాలి చుట్టూనో
పరిభ్రమిస్తూ ఉంటుందా
నరహృదయభావన సదా?")

అని W.B. yeats అనే ఈతరం కవి అడుగుతున్నాడు.

"కవి చెప్పే జవాబేమిట?"

హేమతల్లిని తలెత్తి చూశాన్నేను. "కవీ, దేవుడూ, జ్ఞానీ —వీళ్లెవరూ మనంవేసే ప్రశ్నలకు జవాబులు చెప్పరు." అని చెప్పి నేనూ ఆవర్గానికి చెందినవాణ్ణే అన్నట్లునోరుమూసుకుని ఊరుకున్నాను.

ఇలాంటిమాటలు మాట్లాడటమే పిచ్చితనం అనిపించింది. నాకేమో మాట్లాడటం మొదలుపెడితే ఆపడానికి మనస్సొప్పదు. మాటలు లక్షలకొద్దీ వున్నయ్యే!అన్నిమాటలూ వాడిచూడాలన్నంత సరదా.

"హేమ నువ్వు గట్టివాడవని ఎందుకుచెప్పిందో,ఇప్పుడిప్పుడే అర్థమౌతూంది;" అంది హేమతల్లి. ఉయ్యాల వూగుతున్న వేగానికి పట్టుచీరఅంచు రెపరెపలాడుతూంది. లోపలి లంగా తెల్లఅంచు బయటికగ్గనిపిస్తూంది.

## 64

మా "ప్రేమ సంభాషణ" పూర్తిఅయిందని గ్రహించి నట్టు హేమ మా ముగ్గురికీ కాఫీ తెచ్చింది.

ఆమెతలుపువెనుక పొంచివుందా? మేము మాట్లాడిందంతా తప్పకుండా ఆమెకూ వినిపించి ఉంటుంది. కావాలనే వింటూ నిలబడిందేమో !

హేమ వేడిగా, పొగలుక్రక్కే కాఫీ నాచేతికందించినప్పుడు చేయిచాచి అందుకున్నానే తప్ప, తలెత్తి ఆమె ముఖంలోకి చూడ లేదు. ఎవరిముఖభావంకూడా, అంతతేలిగ్గా, చటుక్కున నిజాన్ని వ్యక్తపరచదన్నవిషయం నాకు తెలుసు.

హేమ మనస్సు పరిశుద్ధమయిందేనా? నామనస్సు పరిశుద్ధ మయిందేనా? మా శరీరాలుకూడా పరిశుద్ధమైనవని నమ్మటానికి నాకు ధైర్యం లేదు.

పాపంలోనే పుట్టి, పాపంలోనే జీవించి, పాపంలోనే మర ణించేవాళ్ళు మానవులు. వాళ్ళని పాపంలోంచి ఉద్ధరించేందుకు జన్మించిన త్యాగజీవి ఏసుక్రీస్తు. బుద్ధుడు ప్రేమపునాదుల్ని త్రవ్విచూచాడు. కన్ఫూషియస్సు మోహపాశాలబంధనాలన్నీ విప్పి చూశాడు. మౌనంహించటమే మాటలముగింపు అనీ, చేష్ట లుడిగివుంటమే కార్యాచరణతాలూకు ముగింపు అనీ నొక్కి చెప్పాడు, లావోజే. ఎన్నోమతాలు—ఎన్నోసూత్రాలు.

మతసూత్రాలు అలావుంచండి! మనస్తత్వసూత్రాలు ? ఈరోజున అందరూనమ్ముతున్న ఆ మనస్తత్వసూత్రాలు ఏమంటున్నయి?

పుట్టినబిడ్డ చనుబాలుతాగేటప్పుడు లైంగికవికార ప్రవృత్తితోనే అలా పాలుతాగుతున్నదంటాడు ఫ్రాయిడ్.

ఈ పరిస్థితిలో పరిశుద్ధతని గురించి మాట్లాడి ప్రయో జనమేమిటి? పరిశుద్ధత అన్న పదానికి అర్థం ఏమిటి ?

శరీరాలకలయికను కోరుతూనే అన్నిశరీరాలు ప్రాణం పోసుకున్నయి, అనేటంతవరకూ సిగ్మండ్ ఫ్రాయిడ్ ఆధునిక మనస్తత్త్వ సిద్ధాంతాలను సాగదీశాడు. అవన్నీ నమ్మడానికి ఆధారాలున్నట్టే కనిపిస్తుంది.

ఈ పరిస్థితిలో, పాలలో కల్తీనీళ్ళని కొలవడానికొక పరికరమున్నట్టే, పరిశుద్ధతని కొలవడానికి ఒక పరికరమేదైనా వుంటే బాగుణ్ణు.

"కాఫీ పుచ్చుకోండి! చల్లారి పోతూంది!" హేమ కంఠ స్వరం నా ఆలోచనల్ని తెగగొట్టింది.

నాచేతిలో కాఫీ కప్పువుండటం చూశాను. ఒక చుక్క కాఫీ చింది నాచొక్కామీద మరక ఏర్పరచింది.

పరిశుద్ధతకి అపవాదేకదా ఈ మరక.

## 65

తలెత్తి హేమని చూశాను.

ఆమె నన్నుచూసినచూపుని ప్రేమవీక్షణమని అభి వర్ణించటం సబబే. నావద్ద లేనిదాన్నేదోచూసి, దానికి పణంగా తనవద్దలేనిదాన్నేదో ఇవ్వడానికి ఆమె సిద్ధంగా వుందని ఆ చూపులో నాకు అర్థమయింది.

ప్రేమంటే నమ్మకంలేని నన్నామె ప్రేమించడం జాలి కలిగిస్తూంది! ఆమె ఏం సుఖం పొందగలదు? కాని, ఆమెను అడ్డుపెట్టటానికి నేనెవణ్ణి?

ఏదో లేనిదానికోసం ప్రాకులాడటం నాకూ ఇష్టమే.

లోకంతో కలిసిమెలసి జీవించటమే సులభం!

ప్రేమ ఒక ఆకర్షణ;—నిజంకాని, స్థిరంగా నిలబడని, ఇంద్రియ సుఖాలమీద ఆధారపడిన, అనివార్యమైన మోహ పాశాన్ని ప్రేమ అంటున్నాం. స్త్రీ పురుషులు పొందే ఆకర్షణని ప్రేమ అని, ఇద్దరుపురుషులు ఆకర్షింపబడితే స్నేహం అని దేవుడన్న ఏదోలేనిదానిపట్ల ఆకర్షణ గల మానవుణ్ణి భక్తుడని అంటున్నాం. ప్రేమ, స్నేహం, భక్తి—ఇవన్నీ ఒకేభావానికి వేర్వేరు పేర్లు.

హేమని నేనో ఆకర్షణ శక్తిగల స్వరూపంగా భావిస్తున్నా. ప్రేమంటే అదేనా?

అదే ప్రేమ అని అంగీకరించటానికి ఆమె సిద్ధంగా వున్నట్టే తోస్తూంది.

శూర్పణఖ గతి ఏమికావాలి?

ఆమెను వెతుక్కుంటూ నేను రాగలిగానే! దాన్నేమనాలి ? ఆమె ఆకర్షణని ఏమనాలి? ఎలా వివరించటం?

హేమ ఓరగా నిలబడి వేడుకచూస్తూంది.

కాఫీతాగేసి, కప్పు బల్లమీదపెట్టి, నా రెండుచేతుల్ని అప్పుడే కొత్తగాచూస్తున్నట్లు మళ్ళీమళ్ళీ పరీక్షగా చూసుకున్నాను.

నాకు చేతులున్నయి. కళాకారుని వేళ్ళున్నయి.

ఆమెకి, ఆ శూర్పణఖ్కి అందమైన గొంతుంది.

శూర్పణఖబారినుంచి ఈ రాముణ్ణి కాపాడేందుకు పరుగెత్తుకు రాగల లక్ష్మణుడే లేడు.

నా చేతులే నాకు పనిచేసిపెట్టాలి.

ఇవిగో నా చేతులు!

అనుకున్నపని చేసితీరే శక్తివంతమైన చేతులివి.

నా శక్తిని వినియోగించటానికి నా భావతీవ్రతే చాలు !

## 66

కాఫీతాగటం బాగానే, తృప్తిగానే వుంది. కాఫీ చిరుచేదులో నా ఆలోచనలచేదుని మరచిపోవటం నాకు సాధ్యమే. ఇది నేను అనుభవపూర్వకంగా గ్రహించిన సత్యం.

''నేను నిన్నపంపిన ఉత్తరం అందిందా?'' అడిగాను.

ఎవరికి పంపినజాబో చెప్పలేదు. కాని హేమ జవాబు చెప్పింది. ''ఉత్తరమా! ఉత్తరం రాలేదే! రేపటి టపాలో వస్తుందేమో!'' అంది...... ''ఇంతవరకు రాలేదు.'' అన్నది.

నేనూ ఉత్తరం రాసిసంపలేదు. నామనస్సులోనే మాటమాటా రాసుకున్నాను. అంతే. ఆ ఉత్తరం ఎలాగో, ఆమెకు అంది వుంటుందని వూహించాను.

అలా ఊహించటం తప్పని తోచలేదు.

చంద్రశేఖరానికి అక్కడ తనకింక పనిలేదని తోచిందేమో ''మరి నేను వెళ్ళిరానా? '' అని లేచాడు.

''సరే!'' అంది హేమ వెంటనే.

తలాడించింది ఉయ్యాల్లో సుందరి.

''లవ్ అంటారే, అది ఏమిటి?'' అని ఎంత గుండెనిబ్బరంతో అడిగిందీవిడ! వెనకటితరంవాళ్ళలో అటువంటి ప్రశ్న ఎవ్వరూ అడిగుండరు. అడిగినా జవాబుకోసం ఎదురు చూసుండరు.

టకటకా నడిచివెళ్ళిన చంద్రశేఖరంవెంట వాకిట్లోదాకా వెళ్ళి తిరిగివచ్చింది హేమ.

కాలేజీ టెన్నీసుటోర్నమెంట్లు వస్తున్నయని, తన పార్ట్నర్‌గాఆడమని అడగాలని చంద్రశేఖర్ వచ్చాడని, నాకా విషయాన్ని తెలపటం తన కర్తవ్యం అయినట్టు చెప్పింది హేమ.

''తెలివైన వాడే. కాని, మంచివాడు.'' అన్నది హేమతల్లి.

ఈ శూర్పణఖ్కి మంచితనం అంటే ఏం తెలుసు?

మంచి చెడ్డలూ, దేవగుణాలు, అసురగుణాలు మానవుల్ని అడుగడుగునా అగచాట్లపాలుచేస్తున్నయి. మనిషి తనే సృష్టించుకున్న కట్టుబాట్లకు బలైపోతున్నాడు.

నా చేతులకి పని చెప్పాలిసిందే! —అవి ఈ జీవితకాలంలో చేయగలిగిన అతిపవిత్రమైన కార్యం ఇది.

ఆమె గొంతుమీద ఎక్కడపెట్టాలో గుర్తుపెట్టుకున్నాను. కోడిపుంజుగొంతు నులిమినట్టు, ఆమె అందమైన గొంతుని పిసికివెయ్యాలి. ఈ శూర్పణఖకి ముక్కు, స్తనాలూ కోసేసి వదిలేస్తే లాభం లేదు; అసురగణాన్ని పూర్తిగా హతమార్చడానికి అది చాలదు.

ఆమె పీడ పూర్తిగా వదిలించెయ్యాలి. ఈ రాముడు పుట్టిందందుకే.

## 67

''హా!'' అన్న ఘోష నాచెవిని పడింది.

నా చేతుల్నీ, ఎదురుగుండావుండినావిడనీ మళ్ళీ మళ్ళీ చూశాను.

హేమకూడా ఆగదిలోనే వుంది. ఆ ఐదారు నిమిషాల్లో ఆమె నాకంటపడినట్టే గుర్తులేదు.

చేతుల్లో, వేళ్ళసందుల్లో రక్తంచిమ్ముతూంది ! ఆగొంతు ఎంతమెత్తగా నలిగిపోయింది! ఆ అందమైన పళ్ళ వరుస! తాంబూలపు కావిరంగుతో ఎర్రనిపెదవులు కొద్దిగ తెరుచుకొని, తలమీది తెల్లవెంట్రుకలుకదులుతూ, వయస్సు ముదురుతూందనిసూచిస్తూ లావెక్కిన శరీరమధ్యంతో, ప్రాణం పోయేటప్పుడు ఆశరీరం ఎంత బాధపడింది!

తలెత్తి చూశాను. ఉయ్యాల్లో కనబడలేదామె.

నా చేతులు చూసుకున్నాను.

అంతా రక్తమయం!

లేచి పరుగెత్తాను.

పోలీసుస్టేషను ఎక్కడుందో తెలుసు నాకు.

The multitudinous seas Incarnadine.

అని మాక్‌బేత్‌లోముక్కలు పాఠంలా అప్పజెప్పా పోలీసు ఇన్‌స్పెక్టరుకి. సప్తసముద్రాలు రక్తమయమై ఉప్పొంగి వస్తున్నాయి అన్నా.

పోలీసు ఇన్‌స్పెక్టరు అంత సులభంగా నన్ను నమ్మేటట్టు లేదు. వెంకటనారాయణారోడ్డు అడ్రసు చెప్పాను. సైకిలు మీద మనిషిని పంపాడు.

నా చేతులు పూర్తిగా రక్తంతో తడిసిపోయి, ఎండిపోయి ఉన్నయ్యే! ఈ రక్తం ఆయనకెందుకు కనుపించలేదు.?

ఆమె శరీరం, తనగొంతుని నాచేతులకు అప్పగించి, ఎలా విలవిల తన్నుకున్నది కళ్ళకు కట్టినట్టు వర్ణించిచెప్పాను.

అప్పటికీ పోలీసు ఇన్‌స్పెక్టరు నమ్మేటట్టు లేదు.

సైకిలు మీదవెళ్ళిన ఆ పోలీసు తిరిగి వచ్చాడు.

కణతమీద వేలుతోకొట్టుకుంటూ ''పిచ్చాడు సార్!'' అన్నాడు.

ఇన్‌స్పెక్టరు, ''నీవల్ల అరగంట పని చెడింది. పోంఫూల్ ఇంటికి పో!'' అన్నాడు.

మా ఇంటిఅడ్రసుమాత్రం అడిగి, రాసి పెట్టుకున్నాడు.

ఆ రక్తపు చేతులతోనే ఇల్లు చేరుకున్నాను.

రుక్కు కూడా నాచేతుల్లో రక్తం కనిపించటం లేదంది.

''హేమ అందంగానే వుంది అన్నయ్యా! పెళ్ళి చేసేసుకో! వదిన నాకు నచ్చింది,'' అంది రుక్కు.

''నువ్వెక్కడ చూశావ్?''

''ఆ హేమగారు, వాళ్ళమ్మా మనింటికొచ్చి అరగంట సేపుండి ఇప్పుడే వెళ్ళారు. వాళ్ళిద్దరూ అరగంటసేపూ నిన్ను గురించే మాట్లాడారు. ఆ అమ్మాయి నిన్ను తప్ప ఎవ్వర్నీ పెళ్ళి చేసుకోదట. నిన్ను చూసి నప్పట్నుంచీ, రెండేళ్ళ నించే వాళ్ళింట్లో రోజూ నిన్నుగురించే చెపుతూండేదట,'' అంటూ రుక్కు గడగడ ఏదో వాగేసింది.

## 68

నిజాన్ని అంగీకరించి తీరాల్సిందే.

శూర్పణఖని పూర్తిగా హతమార్చటం నావల్ల సాధ్యం కాలేదు.

నేను రాముణ్ణి. లక్ష్మణుణ్ణి కాను.

ధారలుగాకారిన రక్తమూ, విలవిల తన్నుకుని కూలి పోయిన దేహమూ హేమకి నేను వ్రాసిన జాబులా వట్టి ఊహలే.

మానవజీవితంలో ఏది ఊహ? ఏది నిజం? విడమరిచి చెప్పటం ఎవరికి సాధ్యం?

నిజానికీ, అబద్ధానికీ మధ్య వున్న గోడ, తెర, గీటు చాలా సున్నితమైంది. అందుచేతే మానవుడు నిజానికీ, అబద్ధానికీ మధ్య ఉయ్యాలలాగుతూ బ్రతకటం సాధ్యమౌతూంది.

నేను శూర్పణఖని చంపేశానన్నమాటా నిజమే.

ఇప్పుడింక హేమతల్లినీడ నాకు శూర్పణఖ స్వరూపంగా కనబడటంలేదు; వూహల్లో కూడా.

శూర్పణఖ ఆరోజున చనిపోయిందనేగా అర్థం?

నా చేతుల్ని మలినపరచినరక్తాన్ని పోలీసుఇన్‌స్పెక్టరు కాని, రుక్కుకాని చూడలేకపోయినా నేను హంతకుణ్ణే. నా చేతులు రక్తంతో మలినమైనట్టే.

శూర్పణఖ ఇప్పుడు కనబడక పోవటం, ఆమె చనిపోయిం దనడానికి సాక్ష్యమేకదా?

శూర్పణఖ లేదు. హేమతల్లిమట్టుకే వుంది.

హేమనిగూర్చే నా ఆలోచనంతా! హేమతల్లినిగూర్చి నాకెందుకిప్పుడు!

అసురగణం ఎక్కడ, ఎంత తలవిరబోసుకుని గల్లంతు చేసినా సరే! నన్ను బాధపెట్టదు. ఒక సాహసకార్యం—అది ఊహామాత్రమేఅయినా సాహసకార్యమేకదా—నెరవేర్చి బ్రతికి బైటపడ్డాను నేను.

రుక్కుకి హేమనచ్చింది అని చెప్పినరోజునే.....నా పెళ్ళి నిశ్చయమై పోయినట్టే.

నాన్నగారు నా అభిప్రాయం అడిగినప్పుడెల్లా ''నేను పరీక్షలకి చదువుతున్నా నాన్నా'' అన్నాను.

రుక్కుమాత్రం ''అన్నయ్యకిష్టమే'' అని నాతరఫున చెప్పేసింది.

పెళ్ళి నిశ్చయమయిపోయింతర్వాత, నేను వెంకట నారాయణారోడ్డుకి వెళ్ళడం మానేశాను. పోవటం మంచిదికాదు అన్నారు నాన్నగారు. అదేమంచిది అనిపించింది నాకూ.

హేమనిగూర్చిన ఆలోచనలు నన్ను రోజూ స్వర్గానికీ, నరకానికీ ఉయ్యాల లూపుతున్నయి, ఎప్పటిలాగ.

చదువుసాగుతూంది మామూలుగా.

బి.ఏలో నేను ఆసంవత్సరం రెండు సబ్జెక్టుల్లో ఫస్టు క్లాసులో ఫస్టుగా పాసయ్యాను.

హేమకూడా పాసయింది.

తర్వాతే పెళ్ళి.

## 69

నేను సాధారణపుమనిషిగా మారడానికి చేసిన ప్రయత్నా లన్నీ ఫలిస్తాయనే అనిపించింది నాకు.

ఇప్పుడిక, మానవుడు మానవుడంటూ ఏదో లక్ష్యాన్ని పట్టుకునిపాకులాడటం లేదు. కాళ్ళు బలపాలుకట్టేలాగ, అస్తమానం నడవటంకూడా మానుకున్నాను. ఇంట్లో కూచుని రుక్కుచెప్పే కబుర్లన్నీ వోపిగ్గా వినటం అలవాటు చేసుకున్నాను.

''హేమచెప్పినట్టు వినేందుకు, ఇదంతా రిహార్సల్,'' అని రుక్కు నన్ను అస్తమానం పరిహాసంచేస్తూంది. అయినా నాకు కోపంరావటంలేదు.

రుక్కు, హేమా తరచు కలుసుకొని నన్నుగురించి ఏవో మాట్లాడుకుంటున్నారని తెలుసు. నన్ను గురించి ఏమి మాట్లాడుకుంటారో! భగవంతునికే ఎరుక.

ఒకరోజున—పెళ్ళికి ముహూర్తంతేదీ నిర్ణయమై పోయింతర్వాత జరిగింది ఇది. పెళ్ళి ముహూర్తానికి ఇంకా ఇరవై రోజులే వ్యవధి ఉంది. రుక్కు నవ్వుకుంటూ వచ్చింది.

''ఎందుకే ఆ నవ్వు?'' అడిగాను.

''హేమ, నీ ప్రేమతత్వాన్ని గూర్చి చెప్పింది. వాళ్ళమ్మ తోను, చంద్రశేఖర్‌తోను, ప్రేమంటే నీకు నమ్మకమే లేనట్టు వాదించావుటగా.''

చచ్చాను: రుక్కు కూడా ప్రేమతత్వాన్నిగూర్చి మాట్లా డటం మొదలుపెట్టిందా? శూర్పణఖనీడ ఇక్కడకూడా పొంచివుందా అని ఉలిక్కిపడ్డాను.

''ఆ సంగతి ఇప్పుడెందుకు?'' అని ముఖం చిట్లించు కున్నాను.

''నీ మాటల్నిబట్టి ప్రేమంటే నమ్మకంలేదని అనిపించినా నీకు ప్రేమంటే నమ్మకంవుందని తర్వాతతెలిసిందట హేమకి.''

''ఎలా?''

''అదా, నీవు వాళ్ళింటినుంచి పారిపోయి, నా ప్రేయసిని పెళ్ళిచేసుకునేందుకు అడ్డుపెట్టిన ఆమెతల్లిని, చంపివచ్చానని పోలీసుస్టేషనుకివెళ్ళి చెప్పేసి లొంగి పోయావుట గా! ఇదంతా ఏదోకథలాగుంది,'' అంటూ నవ్వింది రుక్కు.

అయ్యోరామ! ఈసంగతీ తెలుసా హేమకి, అనుకున్నాను మొదట్లో! తర్వాత తెలిసింది; పోలీసువాడు సైకిలుతీసుకుని తన ప్రేయసిఇంటివరకూ వెళ్ళాడని, తన ప్రేమదూతగా! ఛీ సిగ్గుచేటు !

## 70

పెళ్ళినాడు, పొద్దుట్నుంచీ మా ఇంట్లోనే నాదస్వర విద్వాంసుడు సన్నాయిపాట సాగదీస్తున్నాడు.

నన్నేవో వృశ్చికస్మృతులే ముసురు కుంటున్నాయి.

ఆరోజు, పోలీసుస్టేషన్‌కి వెళ్ళివచ్చింతర్వాత, మళ్ళీ, నాపెళ్ళిరోజునే చూశాను హేమతల్లిని.

హేమా, నేనూ చేతులుపట్టుకుని, మెడలో పూల మాలలతో హేమతల్లికి నమస్కరించడానికి ఆమెదగ్గరికి వెళ్ళాము.

వెనుకటికన్నా ఇంకా యౌవనవతిగా కనిపించింది హేమ తల్లి. ''కూతురికి మంచిసంబంధం కుదిరింది. తల్లి సంతోషం ఇంక చెప్పాలా?'' అన్నారు విశ్వనాథంగారు.

నా కళాకారుని చేతివేళ్ళు జలజలమంటున్నాయి. తలవంచి చూశాను.

హేమ నాచేతివేళ్ళు గట్టిగాపట్టుకునిఉండటం మంచి దయింది.

హేమతల్లిమెడలో నాలుగువేళ్ళతో నొక్కిపట్టడానికి చోటువుంది. ఎంతరక్తం? ఎలా విలవిలా తన్నుకుంది ఆశరీరం చనిపోయేముందు:

హేమతల్లి హేమతల్లిగానే వుంది. ఆమె పక్కన వీడలేదు. శూర్పణఖ ఆరోజే వచ్చిపోయింది.

పెళ్ళికి ఆ ప్రేమదూత—ఆ పోలీసువాడు వచ్చాడు. వాడు రహస్యంగా ''నేను పెద్దమ్మగారితో ఆ సంగతి చెప్పనేలేదు. చిన్నమ్మగారితోనే నాజూగ్గా చెప్పాను. ఆమాత్రం తెలియదా బాబూ నాకు?'' అంటూ కన్ను గీటాడు.

ప్రేమతత్వం తనకు పూర్తిగా తెలుసునని వాడికి నమ్మకం.

వాడినమ్మకం నిజంకాదని చెప్పడానికి నేనెవణ్ణి?

ఏమైనా నాడితృప్తి వాడిది. నేనెందుకు పాడుచేయటం? పిండివంటలతో పెళ్ళిభోజనం దొరికింది వాడికి, వాడుచేసిన ఘనకార్యంవల్ల. అదీ సంతోషింపదగ్గ విషయమేగద!

నా ఆలోచనలవల్ల, కార్యాలవల్ల ఇలాంటి, సులభంగా తృప్తిగొలిపే ప్రయోజనాలు కలిగాయంటే, అదీ బాగానే ఉందనిపిస్తూంది. తెగాతెంపూలేని ఆలోచనలవల్ల లాభ మేమిటి?

ప్రతికార్యం పెళ్ళిభోజనంలాంటి తృప్తికరమైన ఫలితంతో అంతమవాలి. అయితే మంచిది.

నాదస్వరవిద్వాంసుడు మళ్ళీ సన్నాయిపాట మొదలు పెట్టాడు.

హేమ కంటసీ రెట్టుకోటంచూసి ''ఎందుకు'' అనడిగాను రహస్యంగా.

''నాన్నగారు లేరుగద అనిపించింది!'' అన్నది హేమ. ఆమెకిప్పుడా సన్నాయిపాట చావునే జ్ఞాపకంచేస్తూంది! చిత్రం!

''నాకూ మా అమ్మలేదు,'' అన్నాను.

ఆ వాక్యంతో నా ఓటమి నాకు బోధపడింది. శూర్ప ణఖను చంపడానికి ప్రయత్నించి, నానా అవస్థలు పడటమేకాక, ఆమెను నాతల్లిగా స్వీకరించటానికికూడా సిద్ధమయాను.

అసురగణం వృద్ధిపొందక, ఏమవుతుంది?

అయ్యోరామ! అయ్యోలక్ష్మణ! అని అరవవచ్చు! మారు పలకడానికి ఎవరున్నారు!

(స మా ప్తం)

